https://epaper.andhramanam.com/

# ఆంధ్ర మనం

తెలుగు దినపత్రిక

తిరుపతి- బుధవారం 24 జూన్ 2026 | సంపుటి : 01 | సంచిక : 232 | పేజీలు : 8 | వెల రూ.5

PUBLISHED FROM TIRUPATI | AMARAVATHI | RAJAHMUNDRY | VISAKHAPATNAM | KURNOOL | ANANTAPUR | KADAPA | HYDERABAD |

### హర్మూజ్‌పై పట్టు కోసం ఇరాన్ బెట్టు

అమెరికన్లను ఎప్పుడూ నమ్మబోమన్న ఇరాన్



04



### అమెరికా పౌరసత్వం మరింత ఖరీదు

ఫైలింగ్ ఫీజులను 75శాతం పెంచే యోచన 04

# పరవాడ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం

## అగ్నిప్రమాదంలో ఇద్దరు మృతి

ఘటనపై ఆరా తీసిన సిఎం చంద్రబాబు

తక్షణ సహాయ చర్యలకు ఆదేశం

డిప్యూటి సిఎం పవన్, మంత్రి లోకేశ్ తదితరుల దిగ్భ్రాంతి

పరవాడ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం సంభవించింది. మంగళవారం తెల్లవారుజామున ప్లాస్టిక్ పైరోలిసిస్ ఆయిల్ తయారీ కంపెనీ దక్షిణ్ ఎనర్జీలో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో పలువురు కార్మికులు ఫ్యాక్టరీలోనే చిక్కుకుపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందగా.. పలువురికి తీవ్రగాయాలు అయ్యాయి. ఘటన గురించి తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుంది. మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. మరోవైపు పోలీసులూ రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు.



**అనకాపల్లి, జూన్ 23 :** అనకాపల్లి జిల్లా పరవాడలోని ఫార్మా సిటీలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫార్మా సిటీలోని 'దక్షిణ్ ఎనర్జీ' పరిశ్రమలో జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోవడంపై సంతాపం వ్యక్తం చేశారు. మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే, ఈ ప్రమాదంలో గాయపడిన బాధితులను తక్షణమే ఆదుకోవాలని, అత్యంత మెరుగైన వైద్య చికిత్స అందేలా చూడాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక



# 80కి పైగా అంశాలకు క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్

## ఏపీ కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం

వివిధ ప్రాంతాల్లో పెట్టుబడులకు పెద్దపీట

పరిశ్రమలు, ఐటీ,పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లకు ప్రాధాన్యం

రూ.34వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35వేల ఉద్యోగాల కల్పన

ఉండవల్లిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన

జ్యుడిషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.139 కోట్ల వ్యయం

అమరావతిలో ఫైవ్‌స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు

**అమరావతి, జూన్ 23 :** ఏపీ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన భేటీలో 80కి పైగా అజెండా అంశాలకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వివిధ ప్రాంతాల్లో పెట్టుబడుల స్థాపనకు పెద్దపీట వేస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించిన ప్రతిపాదనలకు ఆమో దం తెలిపింది. పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న దాదాపు రూ.34వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35వేల ఉద్యోగాల కల్పన సంబంధించిన నిర్ణయాలకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉండవల్లిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన, ఏపీ జ్యుడిషియల్ అకాడమి నిర్మాణానికి రూ.139 కోట్ల వ్యయంతో పనులు చేపట్టడం తదితర నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతిలో ఫైవ్‌స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖ, తిరుపతి, కర్నూలు, అన్నవరం ప్రాంతాల్లోనూ పర్యాటక ప్రాజెక్టులకు క్యాబినెట్ అంగీకారం

-మిగతా 2 లో..

## పద్మ పురస్కారాలతో రాష్ట్రపతి భవన్ కళకళ

- మమ్ముట్టి, విజయ్ అమృత్‌రాజ్‌కు పద్మభూషణ్
- శిబు సోరెన్‌కు మరణానంతర గౌరవం
- మురళీమోహన్, రాజేంద్ర ప్రసాద్‌కు పద్మశ్రీ



03

# నీట్‌తో విద్యార్థుల్లో గందరగోళం

## హిందీ మనకు అవసరం లేదు

తమిళం, ఇంగ్లీష్ సరిపోతుంది

కుటుంబ పార్టీలకు తాము వ్యతిరేకం


ఎన్నో అవమానాలు ఎదుర్కొని ఇక్కడికి వచ్చా

కరూర్ తొక్కిసలాట ఘటన మరచిపోలేని విషాదం

అసెంబ్లీలో సిఎం విజయ్ కీలక ప్రసంగం



04



04

# వణికిస్తున్న బాస్

కొత్త స్కామ్‌తో కంపెనీలకు ముప్పు

సీఈవోల పేర్లతో ఉద్యోగులను బురిడీ కొడుతున్న సైబర్ కేటుగాళ్లు

వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా మాల్‌వేర్ దాడులు

కంపెనీ ఖాతాల నుంచి కోట్ల రూపాయలు కాజేస్తున్న నేరగాళ్లు

అప్రమత్తంగా ఉండాలని ఐ4సీ హెచ్చరిక

# జొన్నగిరిలో 'బంగారు' భవిష్యత్

## దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభం

రూ.405 కోట్ల పెట్టుబడితో భారీ ప్రాజెక్టు

700 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు

నేడు ప్రాజెక్టును ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు నాయుడు

కరవు, వలసలతో ఒకప్పుడు వార్తల్లో నిలిచిన రాయలసీమ ఇప్పుడు బంగారం ఉత్పత్తితో కొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతోంది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని జొన్నగిరిలో దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభం కానుండటం ఈ ప్రాంత భవిష్యత్తుకు కొత్త ఆశలు కల్పిస్తోంది. రూ.405 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రారంభించనున్నారు.



కర్నూలు, జూన్ 23: జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా ఈ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టును అభివృద్ధి చేశాయి. ప్రాజెక్టు కోసం ప్రభుత్వం 1,500 ఎకరాల భూమిని కేటాయించగా, తొలి దశలో 600 ఎకరాల్లో తవ్వకాలు చేపట్టనున్నారు. ఇప్పటికే గోల్డ్ ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్మాణం పూర్తవగా, ప్రయోగాత్మక నిర్వహణ విజయవంతమైంది. ఈ ప్రాజెక్టు ద్వారా జొన్నగిరి దేశ గోల్డ్ మైనింగ్ రంగంలో కీలక కేంద్రంగా ఎదగనుంది. తొలి ఏడాదిలో 400 కిలోల బంగారం

-మిగతా 2 లో..



02

### కేంద్రమంత్రి రామ్మోహన్‌తో రాష్ట్ర మంత్రుల భేటీ

గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై తుమ్మల విజ్ఞప్తి



02

### వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా

ప్రభుత్వం జీవో విడుదల

చేతల ప్రభుత్వం అన్న లోకేశ్



# గేట్లు సిద్ధం.. తుంగ'భద్రం'

25న కొత్తగేట్లు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

2024లో వచ్చిన వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన 19వ గేటు

నిపుణుల కమిటీ సూచనతో 6 నెల్లలో రూ.51 కోట్లతో 33 కొత్తగేట్ల అమరిక

అమరావతి, జూన్ 23 ఆంధ్ర మనం : ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు వర ప్రదాయిని అయిన తుంగభద్ర ప్రాజెక్టు ఇప్పుడు కొత్తగేట్ల అమరికతో సరికొత్త రూపును సంతరించుకుంది. రూ.51 కోట్ల వ్యయంతో మొత్తం 33 గేట్ల ఏర్పాటు పనులు పూర్తికాగా, వీటిని ఈ నెల 25వ తేదీన కర్నాటక ముఖ్యమంత్రి శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. 73 ఏళ్ల క్రితం నిర్మించిన తుంగభద్ర ప్రాజెక్టు రెండు రాష్ట్రాల్లో లక్షల ఎకరాల ఆయకట్టుకు జీవనాడిగా నిలుస్తోంది. అయితే 2024 ఆగస్టులో వచ్చిన వరద

-మిగతా 2 లో..

# నిందితులను కాపాడటమే లక్ష్యంగా సిట్ విచారణ

## అనుమానాలు వ్యక్తం చేసిన మాజీ మంత్రి అంబటి రాంబాబు

కాపు యువకుడు గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో నిందితులైన పోలీస్ అధికారులను కాపాడటమే లక్ష్యంగా విచారణ నత్తనడకన సాగుతోందని, కృష్ణలంక పోలీస్ స్టేషన్ సీసీ టీవీ ఫుటేజీ మాయం కావడమే దీనికి నిదర్శనమని గుంటూరు జిల్లా వైయస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.



03





## మంగళగిరిలో నేటి నుంచి ఏపీఎల్-2026 క్రికెట్ సందడి

ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హీరో రామ్ చరణ్, ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్.ఎస్. థమన్

02

## వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా

### ప్రభుత్వం జీవో విడుదల : చేతల ప్రభుత్వం అన్న లోకేశ్



**అమరావతి, జూన్ 23:** వడ్డెరలకు క్వారీల్లో 33శాతం వాటా ఇస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. తమది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. 'యువగళం పాదయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలు ప్రత్యక్షంగా చూశా. నాటి పాదయాత్ర సమయంలో తమ కులవృత్తిని కొనసాగించేందుకు క్వారీలు కేటాయించాలని వ్డడెర సోదరులు నన్ను కలిశారు. ఆనాడు నేను ఇచ్చిన హామీ మేరకు క్వారీల్లో 33 శాతం వాటాను వ్డడెరలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నం. 126 జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది' అని అన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంపైట్ల వ్డడెర సంఘాల నేతలు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పరవాడ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

చర్యలని వేగవంతం చేశామని అధికారులు తెలిపారు. ప్రమాద తీవ్రతను గమనించి ఫార్మా సిటీ అగ్నిమాపక కేంద్రం నుంచి రెండు, పరవాడ కేంద్రం నుంచి మరొక ఫైర్ ఇంజన్‌ను తక్షణమే ఘటనా స్థలానికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరపాల్సిందిగా అధికారులను సీఎం ఆదేశించారు. ఇకపోతే అగ్నిప్రమాదంపై మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందడం విచారకరమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మరోవైపు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి లోకేశ్



హామీ ఇచ్చారు. 'దక్షిణ ఎనర్జీ కెమికల్ ఫ్యాక్టరీ'లో జరిగిన అగ్ని ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. ప్రమాదంపై ఆరా తీసిన ఉపముఖ్యమంత్రి... ఇద్దరు కార్మికులు మరణించడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని పవన్‌కు అధికారులు తెలియజేశారు. పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించడానికి తీసుకుంటున్న చర్యలను సమీక్షించాలని డిప్యూటీ సీఎం సూచించారు. విశాఖపట్నం పరిసర పారిశ్రామిక ప్రాంతాల్లోని అన్ని సంస్థల్లో తక్షణమే భద్రతా తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. అగ్నిప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు సంతాపం తెలియజేస్తూ, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఫార్మాసిటీ ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కూడా స్పందించారు. ఈ ఘటన అత్యంత దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందడం విషాదకరమని పేర్కొన్నారు. గాయపడిన కార్మికులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పారిశ్రామిక ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాల అమలు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని తేల్చి చెప్పారు. ప్రమాదంపై పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు కూడా విచారం వ్యక్తం చేశారు. ఈ అగ్నిప్రమాదం దురదృష్టకరమని, క్షతగాత్రులకు అధికార యంత్రాంగం మెరుగైన వైద్యం అందిస్తోందని పేర్కొన్నారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరుగుతోందని.. పూర్తి వివరాలు త్వరలోనే తెలుస్తాయని అన్నారు.



## కేంద్రమంత్రి రామ్మోహన్‌తో రాష్ట్ర మంత్రుల భేటీ


### గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై తుమ్మల విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, జూన్ 23:** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసిన వెంటనే స్పందించి.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరఫున ఫీజిబులిటీ సర్వే చేసినందుకు రామ్మోహన్ నాయుడికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఫీజిబులిటీ సర్వేలో ప్రతిపాదిత స్థలం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతిపాదన చేసినట్లు చెప్పారు. అక్కడ త్వరగా ఫీజిబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రికి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## 80కి పైగా అంశాలకు క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్

(మొదటిపేజీ తరువాయి)

తెలిపింది. ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి మంత్రివ-ర్గం అంగీకారం తెలిపింది. అనంతపురం, కడప జిల్లాల్లో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులకు భూముల కేటాయింపులు, బయోగ్యాస్ ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతి ల్యాండ్ పూలింగ్ స్కీమ్ మొదటి, రెండో దశ కోసం సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లకు సంబంధించి 95 తాత్కాలిక పోస్టుల మంజూరుకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 30 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర కేబినెట్ శుభవార్త చెప్పింది. ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వరంగ సంస్థలు, గురుకుల విద్యాసంస్థలు, సొసైటీ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్ల పెంపునకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే, వె-ఎమో-57 ప్రకారం 2004 సంవత్సరానికి ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన సుమారు 11 వేల మంది ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ నుంచి పాత పెన్షన్ విధానం అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం



తెలిపింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపడంతో ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## 11వేల మంది ఉద్యోగులకు లబ్ధి

### సీపీఎస్ అసోసియేషన్ హర్షం

**అమరావతి, జూన్ 23:** రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఏపీ సచివాలయ సిపిఎస్ ఉద్యోగుల అసోసియేషన్ స్వాగతించింది. జ.వోనెం.57 అమలుపై సీపీఎస్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. కేబినెట్ నిర్ణయంతో రాష్ట్రంలోని 11 వేల మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. వెటరన్, ఫ్యామిలీ అఖా కంట్రిబ్యూషన్‌పై స్పష్టతనిచ్చిన సర్కార్.. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం చూపించింది. ఉద్యోగుల గ్రాడ్యుటీ మేరకు ఫ్యామిలీ పెన్షన్ మంజూరుకు నిర్ణయం తీసుకుంది. దీంతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు అఖా అసోసియేషన్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అఖా అసోసియేషన్ పేర్కొంది. ఏపీ కేబినెట్ సమావేశంలో ఉద్యోగులకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారని ఏపీఎన్‌జీవో అధ్యక్షుడు విద్యాసాగర్ అన్నారు. సీపీఎస్ నుంచి ఓపీఎస్‌లోకి మెమో 57 ప్రకారం 11 వేలమంది ఉద్యోగులకు మేలు జరిగిందన్నారు. ప్రభుత్వరంగ ఉద్యోగుల పదవి విరమణ వయసును 60 నుంచి 62కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. కేబినెట్ నిర్ణయంతో ఈరోజు ఉద్యోగుల కల నెరవేరిందన్నారు. అందుకే సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు ఉద్యోగులు ధన్యవాదాలు తెలియజేస్తున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ అంశాన్ని సీఎం చంద్రబాబు పరిశీలించాలని విద్యాసాగర్ కోరారు.

## వైకాపా కుల, కుట్ర రాజకీయాలు తిప్పికొట్టాలి

### ప్రతి అంశంపైనా అవగాహన పెంచుకోవాలి
### మంత్రులకు చంద్రబాబు సూచన

**అమరావతి, జూన్ 23:** కేబినెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు కీలక వ్యాఖ్యలు చేశారు. క్రిమినల్స్‌ను వైసీపీ వెనకేసుకొస్తూ రాజకీయం చేస్తోందన్నారు. వైసీపీ నేతలు కుల విటింగ్‌లు పెడుతూ కులాల మధ్య చిచ్చు పెట్టే కుట్రల్ని దీటుగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కర్నూలులో ఇటీవల చోటుచేసుకున్న ఘటనను ప్రస్తావించిన సీఎం, గ్రామస్థులే బహిష్కరించిన వ్యక్తులకు వైసీపీ మద్దతుగా నిలవడం విచారకరమని వ్యాఖ్యానించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను అనవసర వివాదాల్లోకి లాగేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి సందర్భాల్లో కూటమి ఐక్యతను చాటే విధంగా మంత్రులంతా స్పందించాలని సూచించారు. ప్రభుత్వ పనితీరును మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలంటే ప్రతి మంత్రి అన్ని శాఖలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై కూడా సీఎం కీలక ప్రకటనలు చేశారు. జొన్నగిరి గ్రామాన్ని 'స్వర్ణ గ్రామం'గా నామకరణం చేయాలని ప్రతిపాదించారు. అలాగే జూలై 3న కడప స్టీల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. కులాల మధ్య చిచ్చుపెట్టే ఆ కుట్రలను దీటుగా తిప్పికొట్టాలని మంత్రులకు ఆయన సూచించారు. మంత్రులు అన్ని శాఖలపైనా అవగాహన పెంచుకోవాలి. తన శాఖ పరిధి కాదని కూర్చోకుండా ప్రతి అంశంపై స్పందించాలి. డీఎస్సీ, వివిధ అంశాలపై వైకాపా చేసే దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి. కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ వ్యవహారంలో ప్రభుత్వ చిత్తశుద్ధిని అతడి కుటుంబసభ్యులు నమ్మారని మంత్రులు అన్నారు. ఈ అంశంలో వైకాపా రాజకీయాలు చేస్తోందని విమర్శించారు.

## గేట్లు సిద్ధం.. తుంగ'భద్రం'

(మొదటిపేజీ తరువాయి)

ప్రవాహానికి 19వ గేటు కొట్టుకుపోయింది. అప్పటికప్పుడు నీటి వృధాను అడ్డుకునేందుకు ఏపీ ప్రభుత్వ చొరవతో, సీఎం చంద్రబాబు సూచనతో సీనియర్ ఇంజనీర్ కన్నయ్య నాయుడు నేతృత్వం వహించి స్టాప్‌లాక్ గేటును అమర్చారు. స్పిల్ వే గేట్లు అన్నీ మార్చాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక ఇవ్వడంతో 6 నెలల్లో కొత్తగేట్లను పూర్తి చేసి ఏపీ-కర్నాటక రాష్ట్రాలు పునరుజ్జీవం పోశాయి.

### ఏపీలో 1.46 లక్షల ఎకరాలకు నీరు

తుంగభద్ర ప్రాజెక్టు ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు, వందల గ్రామాలకు తాగునీరుతో ఏపీ, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలకు కీలకంగా ఉంది. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే తుంగభద్ర ప్రాజెక్టు కింద 1.46 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతోంది. కుడి కాలువ ద్వారా కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు సాగు నీరందుతోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు భద్రతను ఏపీ-కర్నాటక రాష్ట్రాలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని గేట్ల ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేశా-యి. 25వ తేదీన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని హోస్‌పేటలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.




## మంగళగిరిలో నేటి నుంచి ఏపీఎల్-2026 క్రికెట్ సందడి

### ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హీరో రామ్ చరణ్, ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్.ఎస్. థమన్

**మంగళగిరి, జూన్ 23 ఆంధ్ర మనం :** మంత్రి నారా లోకేష్ చొరవతో మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జీఎంఆర్ ఏపీఎల్-2026 క్రికెట్ టోర్నమెంట్ రేపటి నుంచి ఘనంగా ప్రారంభం కానుంది. జూన్ 24 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌లో రాష్ట్రంలోని వివిధ జట్లు పాల్గొని క్రికెట్ అభిమానులకు ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లను అందించనున్నాయి. మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ స్టేడియంలో తొలిసారిగా జరుగుతున్న ఏపీఎల్-2026 టోర్నమెంట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆటగాళ్లు, ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రేపు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటుడు రామ్ చరణ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అలాగే ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్.ఎస్. థమన్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. ఏసీఏ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఏసీఏ కార్యదర్శి, అమలాపురం ఎంపీ సానా సతీష్‌తో పాటు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు కార్యక్రమంలో పాల్గొననున్నారు. క్రీడల అభివృద్ధికి మంత్రి నారా లోకేష్ ఎల్లప్పుడూ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, మంగళగిరిలో అంతర్జాతీయ స్థాయి క్రీడా వేదికల ద్వారా యువతకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. ఏపీఎల్-2026 టోర్నమెంట్ ద్వారా రాష్ట్ర క్రికెట్ ప్రతిభకు మరింత గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా క్రికెట్ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# జొన్నగిరిలో 'బంగారు' భవిష్యత్

(మొదటిపేజీ తరువాయి)

ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, వచ్చే ఏడాది నుంచి ఉత్పత్తిని 900 కిలోలకు పెంచే ప్రణాళిక సిద్ధం చేశారు. దశలవారీగా ప్లాంట్ సామర్థ్యాన్ని విస్తరించి ఏడాదికి రెండు టన్నుల వరకు బంగారం ఉత్పత్తి చేయాలని సంస్థలు భావిస్తున్నాయి. ప్రాజెక్టు ప్రారంభంతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. సుమారు 700 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు దక్కనున్నట్లు అంచనా వేస్తున్నారు. రవాణా, సేవలు, ఇతర అనుబంధ రంగాల్లో పరోక్ష ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

### రాష్ట్రానికి ఆదాయ వనరు

బంగారం ఉత్పత్తి విలువలో నాలుగు శాతం రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో అందనుంది. తొలి ఏడాది 400 కిలోల ఉత్పత్తితో రాష్ట్ర ఖజానాకు సుమారు రూ.57 కోట్ల ఆదాయం సమకూరుతుందని





అంచనా వేస్తున్నారు. ఉత్పత్తి 900 కిలోలకు చేరుకున్న తర్వాత ఈ ఆదాయం రూ.144 కోట్ల వరకు పెరిగే అవకాశముంది. బుధవారం జొన్నగిరికి చేరుకోనున్న సీఎం చంద్రబాబు గోల్డ్ ప్రాసెసింగ్ ప్లాంట్ తొలి యూనిట్‌ను ప్రారంభించనున్నారు. అలాగే విస్తరణలో భాగంగా రెండో యూనిట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం నిర్వహించే బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించను న్నారు. జొన్నగిరిలో గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ప్రారంభం కేవలం ఒక పరిశ్రమ ఏర్పాటు మాత్రమే కాకుండా రాయలసీమ ఆర్థికాభివృద్ధికి కొత్త అధ్యాయంగా నిలవనుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస-్తున్నారు. ఒకప్పుడు కరవుతో గుర్తింపు పొందిన ఈ ప్రాంతం ఇకపై బంగారం ఉత్పత్తితో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఆంధ్ర మనం

బుధవారం జూన్ 24 2026

## నిందితులను కాపాడటమే లక్ష్యంగా సిట్ విచారణ

**అనుమానాలు వ్యక్తం చేసిన మాజీ మంత్రి అంబటి రాంబాబు**



**గుంటూరు, జూన్ 23 ఆంధ్ర మనం :** కాపు యువకుడు గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో నిందితులైన పోలీస్ అధికారులను కాపాడటమే లక్ష్యంగా విచారణ నత్తనడకన సాగుతోందని, కృష్ణలంక పోలీస్ స్టేషన్ సీసీ టీవీ ఫుటేజీ మాయం కావడమే దీనికి నిదర్శనమని గుంటూరు జిల్లా వైయ-స్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ నాగరాజు మీద కేసు నమోదు చేసిన మరుక్షణమే అరెస్ట్ చేయకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పోలీస్ స్టేషన్‌లలో 18 నెలల పాటు సీసీటీవీ ఫుటేజీలను నిల్వ చేసి ఉంచాలన్న నిబంధన ఉల్లంఘించారని, సీఐ నాగరాజును అరెస్ట్ చేసి ఉంటే ఆ ఫుటేజీ మాయమయ్యేదే కాదన్నారు. ఒక పద్ధతి ప్రకారం పోలీసులను పోలీసులే కాపాడే కుట్రలో భాగంగా సర్వశక్తులూ ఒడ్డుతున్నారని ఆరోపించారు. నేరస్తులను నేరస్తులుగానే చూడాలన్న పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలతో నేను ఖచ్చితంగా ఏకీభవిస్తున్నానని, అలాంటప్పుడు లాకప్‌డెత్ ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐని కాపాడటానికి ధర్నాలు చేస్తున్న జనసేన నాయకులను ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. సాయికృష్ణను లాకప్‌లో చంపడమే కాకుండా శవాన్ని ఇవ్వకుండా కాల్చేసి బూడిద కూడా దొరక్కుండా మాయం చేయడం, సీసీటీవీ ఫుటేజీలు తుడిచేయడం, ఇలా వరుసపెట్టి తప్పుల మీద తప్పులు చేస్తూనే ఉన్నారని ధ్వజమెత్తారు. ఈ కేసు సీబీఐ విచారణ చేస్తే తప్ప నిందితులకు శిక్ష పడదని మాజీ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు.

## టూరిస్ట్ బస్సుల పన్ను తగ్గింపుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్

**మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చొరవ ఫలితం.. టూరిస్ట్ బస్సులకు భారీ ఊరట**

**అమరావతి, జూన్ 23 ఆంధ్ర మనం :** ఆల్ ఇండియా టూరిస్ట్ పర్మిట్ కలిగిన టూరిస్ట్ బస్సులపై త్రైమాసిక పన్నును తగ్గించే ప్రతిపాదనకు నేడు జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారి చొరవతో ఈ ప్రతిపాదనను క్యాబినెట్ పరిశీలించి ఆమోదించింది. ప్రస్తుతం ప్రతి సీటుకు త్రైమాసికానికి రూ.4,000గా ఉన్న పన్నును రూ.2,500కు తగ్గించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో టూరిస్ట్ బస్సు యజమానులకు గణనీయమైన ఊరట లభించడంతో పాటు ఇతర రాష్ట్రాలకు మారిన వాహనాల రిజిస్ట్రేషన్లు తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే అవకాశం ఏర్పడనుంది. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర రవాణా రంగ అభివృద్ధి, టూరిజం ప్రోత్సాహం, వాహన యజమానుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో ప్రయోజనకరమని మంత్రి పేర్కొన్నారు.

## కిరాణాషాపు నుంచి డేటా సెంటర్ వరకు సింగిల్ పోర్టల్ ద్వారా అనుమతులు

- ఇకపై ప్రతినెలా ప్రధాన ప్రాజెక్టుల భూమిపూజ, ప్రారంభోత్సవాలు!
- 20లక్షల ఉద్యోగాల కల్పనపై లోకేష్ నేతృత్వంలో మంత్రుల బృందం సమావేశం

**అమరావతి, జూన్ 23 ఆంధ్ర మనం :** రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం, కిరాణా కొట్టు నుంచి డేటా సెంటర్ వరకు సింగిల్ పోర్టల్ ద్వారా అనుమతులు మంజూరు చేసే విధానాన్ని రూపొందించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాల కల్పనకు మంత్రి లోకేష్ నేతృత్వంలో ఏర్పాటైన మంత్రుల బృందం సమావేశం ఉండవల్లి నివాసంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేష్, టీజీ భరత్ (ఆన్ లైన్ ద్వారా) హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువచ్చిన 750 భారీ పరిశ్రమలు వివిధ దశల్లో ఉన్నాయి, ఇవి పూర్తిస్థాయిలో పట్టాలెక్కితే పెద్దఎత్తున రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి, సాధ్యమైనంత త్వరగా ఆయా పరిశ్రమలు గ్రౌండింగ్ అయ్యేలా పరిశ్రమల శాఖ, ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు అధికారులు ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ ప్రత్యేకశ్రద్ధ వహించాలని అన్నారు. పనులను వేగవంతంచేసి ప్రతినెలా ప్రాజెక్టుల భూమిపూజ, ప్రారంభోత్సవాలు ఉండేలా అధికారులు చొరవచూపాలని కోరారు.

### స్లరీ పైప్‌లైన్‌పై అధ్యయనం చేయండి

స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ మన ప్రభుత్వ ప్రత్యేకతలు, సులభతరమైన సర్వీస్ డెలివరీ అందించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. రాష్ట్రంలో గార్మెంట్ పరిశ్రమలను ఆకర్షించడానికి చేపట్టాల్సిన చర్యలు, అందించాల్సిన ప్రోత్సాహకాలపై సమావేశంలో చర్చించారు. ఎంప్లాయ్ మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్స్ అందించే అంశాన్ని పరిశీలించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న టెక్స్ టైల్ పరిశ్రమలు క్యాప్టివ్ పవర్ ఉత్పత్తి చేసుకునేందుకు ఏడాదిపాటు బ్యాంకింగ్ ఫెసిలిటీ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని అన్నారు. అనకాపల్లి -- విశాఖ -- విజయనగరం జిల్లాలు స్టీల్ హబ్ గా ఆవిష్కృతమవుతున్న నేపథ్యంలో కొత్తగా రాష్ట్రానికి వచ్చేందుకు మరికొన్ని ఉక్కు పరిశ్రమలు ఆసక్తిచూపుతున్నాయి, ఇందులో ప్రధానమైన ముడిసరుకు సరఫరా కోసం స్లరీ పైప్ లైన్ కావాలని ఆయా సంస్థలు కోరుతున్నాయి, దీనిపై అధికారులు అధ్యయనం చేయాల్సిందిగా మంత్రి లోకేష్ సూచించారు. ఈ సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, పంచాయితీరాజ్, రూరల్ డెవలప్ మెంట్ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, టూరిజం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు సీఈవో షన్మోహన్, స్కిల్ డెవలప్ మెంట్ డైరెక్టర్ గణేష్ కుమార్, ఏపీఐఐసీ ఎండీ ఏఎస్ దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరు ఆలయాల అభివృద్ధికి శ్రీవాణి ట్రస్ట్ నిధులు

**ఏపీ ప్రభుత్వం అనుమతి**

**అమరావతి, జూన్ 23 ఆంధ్ర మనం :** తితిదే బోర్డు, శ్రీవాణి ట్రస్ట్ తీర్మానాల మేరకు ఆరు దేవాలయాల పునర్నిర్మాణం, అభివృద్ధి పనులకు శ్రీవాణి ట్రస్ట్ నిధులు వెచ్చించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సికింద్రాబాద్ (శ్రీగిరి)లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.50లక్షలు, ధర్మవరం (సిద్ధయ్యగుట్ట)లోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి రూ.50.85లక్షలు, సిద్ధిపేట జిల్లా దొమ్మాటలోని శ్రీమహాకాళేశ్వర ఆలయానికి రూ.4.60 కోట్లు కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. అనకాపల్లి జిల్లా మునగపాకలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయానికి రూ.1.75కోట్లు, సంగారెడ్డి జిల్లాలోని కించన్‌పల్లిలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.1.09కోట్లు, కర్నూలు జిల్లా హుస్సేనాపురంలోని శ్రీసుంకులమ్మ, మారెమ్మ దేవాలయానికి రూ.1.10కోట్ల నిధులు కేటాయించేందుకు అనుమతించింది.

# బీసీల విద్యకు 'కూటమి' దన్ను

**కొత్తగా 10 బీసీ గురుకులాల ఏర్పాటు**

**నూతన గురుకులాల ఏర్పాటుపై మంత్రి సవిత హర్షం**

**అమరావతి, జూన్ 23 ఆంధ్ర మనం :** విద్యతోనే బీసీలు మరింత ఉన్నత స్థానాలకు చేరుకోగలరనేది సీఎం చంద్రబాబునాయుడు బావన. ఇటీవల ఆరు మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసింది. ఇపుడు బీసీ విద్యార్థులకు మేలు కలిగేలా నూతన విద్య సంస్థలు నెలకొల్పాలని నిర్ణయించారు. రాష్ట్రంలో కొత్తగా పది మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కొత్త గురుకులాల్లో 37 మంది చొప్పున్న ఉద్యోగులను భర్తీ చేయనున్నారు. ఈమేరకు మంగళవారం సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో జరిగిన కేబినెట్ భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో బీసీ బిడ్డలందరూ విద్య అభ్యసించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బడి బయట ఏ బీసీ బిడ్డా ఉండకూడదనేది సీఎం చంద్రబాబు ప్రధాన ఉద్దేశం. దీనిలో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక వైపు బీసీ హాస్టళ్లు, మరో ఎంజేపీ గురుకులాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోంది. సకాలంలో డైట్ బిల్లులు, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తోంది. మారుతున్న పరిస్థితులకనుగుణంగా సాంకేతిక విద్యకు కూడా ప్రాధాన్యమిస్తోంది. దీంతో బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లలో తమ



పిల్లలను చేర్పించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపతున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం ఎంజేపీ గురుకుల పా-ఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేయడం, కొత్త గురుకులాలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టింది.

### 6 గురుకులాలు అప్ గ్రేడ్

ఎంజేపీ గురుకులాల సీట్లకు డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఇటీవల ఆరు బీసీ గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసింది. కొత్తవలస(విజయనగరం), ఆత్మకూరు, గోలగముడి(నెల్లూరు), కలికిరి(అన్నమయ్య), ఓనిపెంట (కడప), నాసనకోట (శ్రీ సత్యసాయి జిల్లా) ఎంజేపీ గురుకుల పాఠశాలలను అప్ గ్రేడ్ చేశారు. ఆయా గురుకులాలల్లో తరగతులు సైతం ప్రారంభమయ్యాయి.

### కొత్తగా 10 గురుకులాల ఏర్పాటు

తాజాగా కొత్త గురుకుల పాఠశాలలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం జరిగిన కేబినెట్ భేటీలో మంత్రమండలి ఆమోదం కూడా తెలిపింది. చ్చెర్ల(శ్రీకాకుళం), నక్కపల్లి(అనకాపల్లి), మాచెర్ల(పల్నాడు), గిద్దలూరు(మార్కాపురం), గుంతకళ్లు(అనంతపురం), రాయచోటి(అన్నమయ్య), పత్తికొండ, మంత్రాలయం(కర్నూలు), పెనుకొండ,కదిరి(శ్రీసత్యసాయి) లో ఎంజేపీ గురుకులాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో గురుకులంలో 37 బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ గురుకుల పాఠశాలలో అయిదు బాలికలు, మరో అయిదు బాలుర పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. ఆరు బీసీ గురుకులాలను జూనియర్ కళాశాలలుగా కూటమి ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసిందన్నారు. బీసీల విద్య కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్న సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్ కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు.

## బూతు సంస్కృతికి కేరాఫ్ అడ్రస్ వైసీపీ

- సాయికృష్ణ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతోంది:
- నిందితుడైన సీఐ నాగరాజు సస్పెన్షన్, సిట్ విచారణ ముమ్మరం
- మంత్రి కందుల దుర్గేష్



**అమరావతి జూన్ 23 ఆంధ్ర మనం :** రాజకీయ నాయకుల ప్రవ-ర్తనా నియమావళి, నైతిక విలువల గురించి విపక్ష వైసీపీ నేతల నుండి నేర్చుకోవాల్సిన దౌర్భాగ్య స్థితిలో రాష్ట్ర రాజకీయం లేదని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలోని 4వ బ్లాక్ పబ్లిసిటీ సెల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన వైసీపీ నేతల వైఖరిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

### విలువల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదు

గత ఐదేళ్ల కాలంలో వైసీపీ నేతలు ప్రదర్శించిన అసభ్యకర సంస్కృతిని మంత్రి దుర్గేష్ తీవ్రంగా ఖండించారు. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ మోహన్ రెడ్డి, నాటి సీఎం చంద్రబాబు నాయుడుని నడిరోడ్డుపై ఉరితీయాలని చేసిన వ్యాఖ్యలను ఆదర్శంగా తీసుకోవాలా? అని ప్రశ్నించారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు, ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి వంటి నేతలు సీఎం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాతృమూర్తిపై చేసిన వ్యక్తిగత, అసభ్యకర దూషణలను రాష్ట్ర ప్రజలు ఇంకా మర్చిపోలేదని గుర్తుచేశారు. రాజకీయాల్లో విలువల్లేని వ్యవస్థను పెంచి పోషించిన పార్టీ వైసీపీ మాత్రమేనని ఎద్దేవా చేశారు. సాయికృష్ణ అదృశ్యం కేసులో కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, చట్టబద్ధంగా వ్యవహరిస్తోందని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. కేసు తీవ్రతను బట్టి నిందితుడైన సీఐ నాగరాజును తక్షణమే సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నేతృత్వంలో విచారణాధికారిని నియమించడమే కాకుండా, లోతుగా దర్యాప్తు చేయడానికి ప్రత్యేక విచారణ బృందాన్ని(సిట్) ఏర్పాటు చేశామన్నారు. సిట్ అధికారులు ఇప్పటికే సీఐ నాగరాజును అదుపులోకి తీసుకోవడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. సాయికృష్ణ కేసును అడ్డం పెట్టుకొని ద్రాక్షారామం, కాకినాడల్లో వైసీపీ నేతలు కులాల పేరుతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ సమాజంలో విభజన తేవాలని చూస్తున్నారని మంత్రి దుర్గేష్ మండిపడ్డారు. ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా దానికి కులం రంగు పూసి రాజకీయ లబ్ధి పొందడమే ధ్యేయంగా వైసీపీ దిగజారిపోయిందని విమర్శించారు. ప్రభుత్వం తప్పు చేస్తే నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలే తప్ప, ప్రతి అంశంలోనూ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని లాగి, ఆయనను ఒక కులానికి పరిమితం చేయాలని చూస్తే ప్రజలు క్షమించరన్నారు. "తాను పుట్టిన కులం పట్ల గౌరవం ఉన్నప్పటికీ, రాజకీయంలో ఉన్న వ్యక్తిగా అన్ని కులాలను సమానంగా చూ-స్తానని, అందరి అభివృద్ధికి పాటుపడతానని జనసేనాని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఆయన ఉన్నత వ్యక్తిత్వాన్ని తక్కువ చేసేందుకు వైసీపీ చేస్తున్న ప్రయత్నాలు హాస్యాస్పదం." అని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ గతంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేశారు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఇలాగే బలంగా ఉంటే భవిష్యత్తులో తాము ఎప్పటికీ అధికారంలోకి రాలేమని, రాజకీయ నిరుద్యోగులుగా మిగిలిపోతామనే భయంతోనే వైసీపీ నేతలు ఈ విధమైన ఉన్మాద తాండవాలు చేస్తున్నారని మంత్రి దుర్గేష్ ఎద్దేవా చేశారు.



## హర్మ్మూజ్‌లో ఒక్కరోజే 1.9కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా : ట్రంప్

**వాషింగ్టన్ :** అమెరికా-ఇరాన్‌ల మధ్య శాంతి ఒప్పందంతో హర్మ్మూజ్ జలసంధిలో నౌకాయానం తిరిగి ఊపిరి పీల్చుకుంటోంది. తాజా పరిస్థితులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. నిన్న ఒక్కరోజే 1.9 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు రవాణా జరిగిందని, ఇది ఆల్‌టైమ్ రికార్డు అని పేర్కొన్నారు. చమురు ధరలు పడిపోతున్నాయని.. ప్రపంచం సురక్షితమైన ప్రదేశంగా మారిందంటూ ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు చేశారు. ఇక ఇరాన్‌తో ఒప్పందం గురించి ప్రస్తావిస్తూ.. భవిష్యత్తులో అత్యున్నత స్థాయి అణు తనిఖీలకు ఆ దేశం అంగీకరించిందన్నారు. "నిరసనలు, తప్పుడు ప్రచారాల ద్వారా అమెరికా విజయాన్ని తక్కువ చేసే ప్రయత్నం చేసినప్పటికీ.. భవిష్యత్తులో అత్యున్నత స్థాయిలో అణు తనిఖీలకు ఇరాన్ అంగీకరించింది. అణు నిజాయతీకి ఇది ధీమా కల్పిస్తోంది. ఇందుకు వాళ్లు కట్టుబడి లేకుంటే తదుపరి చర్చలు ఉండవు. దీనితోపాటు ఇరాన్ చేసిన కొన్ని ప్రతిపాదనల ఆధారంగా ఎలాంటి దిగ్బంధనం లేకుండా హర్మ్మూజ్‌ను తెరిచి ఉంచేందుకు నేను అంగీకరించాను. దిగ్బంధనాన్ని తిరిగి ప్రారంభిస్తే నౌకలు ప్రస్తుతం ఉన్నచోటే నిలిచిపోతాయి. కానీ, ప్రస్తుతానికి అలా జరగడం అసాధ్యంగా కనిపిస్తోంది. అమెరికా విడుదల చేసే నిధులతో ఆహారం, వైద్య సామగ్రి వంటి వాటిని మాత్రమే వాళ్లు కొనుగోలు చేయగలరు. అంతేకాదు, వాటిని పూర్తిగా అమెరికా నుంచే కొనాల్సి ఉంటుంది. ఇరాన్‌కు ఇప్పుడివి ఎంతో అవసరమని భావిస్తున్నా. సంప్రదింపులు జరుగుతున్నాయి" అని ట్రంప్ పేర్కొన్నారు.

## మీ తప్పులను కవర్ చేసుకోవడానికి భారత్‌పై నిందలా?

**పాక్‌కు స్ట్రాంగ్ కౌంటర్**

**న్యూఢిల్లీ, జూన్ 23:** పీఓకేలో ఆందోళనలతో పాటు సింధూ జలాల ఒప్పందానికి సంబంధించి పాక్ మంత్రి చేసిన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఆ దేశం ఇలాంటి నీచ ప్రయత్నాలకు పాల్పడుతోందని మండిపడింది. ఆ మంత్రి చేసిన ఆరోపణలన్నీ అవాస్తవమేనని తేల్చి చెప్పింది. అసలేం జరిగిందటే.. ఇటీవల పాక్ ఆక్రమిత కశ్మీర్ (గూఖ)లో హింసాత్మక నిరసనలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. దీనిపై ఇటీవల పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. ఈ ఆందోళనల వెనుక భారత్ ప్రభావం ఉందంటూ నోరు పారేసుకున్నారు. అంతటితో ఆగకుండా.. పాకిస్థాన్ నీటి భద్రతకు ముప్పు వాటిల్లిందని భావిస్తే భారత్‌పై యుద్ధానికి కూడా వెనుకాడబోమని అన్నారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ మీడియా సమావేశంలో స్పందిస్తూ ఖవాజా వ్యాఖ్యలకు దీటుగా బదులిచ్చారు. "తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, ఆ దేశంలో జరుగుతోన్న మానవ హక్కుల ఉల్లంఘన నుంచి ప్రపంచం దృష్టి మళ్లించేందుకు పాక్ ఇలాంటి విఫల ప్రయత్నాలు చేస్తోంది. ఈ కల్పిత ఆరోపణలను మేం తోసిపుచ్చుతున్నాం. పాకిస్థాన్ బలవంతపు ఆక్రమణలో ఉన్న ప్రాంతాలలో (పీఓకేను ఉద్దేశిస్తూ) దశాబ్దాలుగా ఆర్థిక దోపిడీ కొనసాగుతోంది. అక్కడి ప్రజలు ప్రాథమిక హక్కులను కోల్పోతున్నారు. పాలనాపరమైన అణచివేత విధానాల ఫలితంగానే ప్రస్తుతం అక్కడ నిరసనలు జరుగుతున్నాయి. ఆ ఆందోళనలపై పాక్ ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడుతోంది. అమాయక పౌరులపై కాల్పులు చేయడంతో పాటు ఔషధ సరఫరా, ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపివేసింది. ఈ బలవంతపు చర్యల కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దురాగతాలకు గానూ అంతర్జాతీయ సమాజం పాక్‌ను జవాబుదారీగా నిలబెడుతుందని ఆశిస్తున్నాం" అని రణ్‌ధీర్ వెల్లడించారు.



## పద్మ పురస్కారాలతో రాష్ట్రపతి భవన్ కళకళ

- మమ్ముట్టి, విజయ్ అమృత్‌రాజ్‌కు పద్మభూషణ్
- శిబు సోరెన్‌కు మరణానంతర గౌరవం
- మురళీమోహన్, రాజేంద్ర ప్రసాద్‌కు పద్మశ్రీ

**న్యూఢిల్లీ, జూన్ 23:** దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ అవార్డుల ప్రదానోత్సవం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జరిగింది. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు హాజరయ్యారు. భారతీయ సినీ రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా మలయాళ సినీ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ పురస్కారం ప్రదానం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో భారత టెన్నిస్‌కు విశేష గుర్తింపు తీసుకొచ్చిన విజయ్ అమృత్‌రాజ్‌కు కూడా పద్మభూషణ్ అవార్డు అందజేశారు. వైద్య రంగంలో చేసిన సేవలకు ప్రముఖ వైద్యుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని పద్మభూషణ్‌తో సత్కరించారు. గిరిజనుల హక్కుల కోసం దీర్ఘకాలం పోరాటం చేసిన జేఎంఎం వ్యవస్థాపకుడు శిబు సోరెన్‌కు మరణానంతరం పద్మభూషణ్ పు-రస్కారం ప్రకటించారు. ఆయన తరఫున సతీమణి రూపి సోరెన్ రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. తెలుగు చలనచిత్ర రంగానికి చెందిన సీనియర్ నటులు మురళీమోహన్, రాజేంద్ర ప్రసాద్‌లకు పద్మశ్రీ పురస్కారాలు లభించాయి. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన వేడుకలో వారు అవార్డులను అందుకున్నారు. విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో చేసిన విశేష కృషికి గుర్తింపుగా తెలంగాణకు చెందిన శాస్త్రవేత్త చంద్రమౌళికి పద్మశ్రీ పురస్కారం ప్రదానం చేశారు. వివిధ రంగాలకు చెందిన ప్రతిభావంతులు, విశిష్ట వ్యక్తుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది.

## పెళ్లి కుదిరిన యువతికి వేధింపులు..

**అవమానంతో కుటుంబం ఆత్మహత్య**



**మైసూరు :** పెళ్లికి ముందు ఆ యువకుడితో స్నేహంగా మెలగడమే ఆమె చేసిన తప్పు. స్నేహం పేరిట చేరువై.. కలిసి తీసుకున్న ఫొటోలను అడ్డుపెట్టుకుని బెదిరింపులకు దిగాడు. పెళ్లి కుదిరిన ఆ యువతికి నరకం చూపాడు. చివరికి.. పెళ్లిసంబంధం కుదుర్చుకున్న వారికి తనతో సన్నిహితంగా ఉన్నట్లు కనిపించే ఫొటోలను పంపించి కుట్రకు తెగించాడు. ఆ అవమానభారంతో యువతితో పాటు ఆమె తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకున్నారు. పెళ్లి పనులతో కళకళలాడాల్సిన ఆ ఇంటిలో తీవ్ర విషాదం అలముకుంది. కర్ణాటక రాష్ట్రం మైసూరు జిల్లా కెంపయ్యనహుండి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఉల్లాస్ గౌడ అనే యువకుని బెదిరింపులతో యువతి రక్షితతో పాటు ఆమె తండ్రి శివణ్ణ, తల్లి నాగరత్న విషం తాగి, ఉరేసుకున్నారు. రక్షితకు వివాహం నిశ్చయమైనా.. నిన్ను ప్రేమిస్తున్నానని, తనను పెళ్లి చేసుకోకపోతే కల్యాణ మండపానికి వచ్చి అడ్డుకుంటానని, నీ ఫొటోలు, వీడియోలను బయటపెడతానని ఉల్లాస్ గౌడ బెదిరిస్తూ వచ్చాడు. అప్పటికే ఫొటోలను వరుడికి పంపాడనే బాధ వారిని వెంటాడింది. బెదిరింపులు తాళలేక, లేఖ రాసి పెట్టి ముగ్గురూ ఆత్మహత్య చేసుకున్నారని టి.నరసీపుర పట్టణ ఠాణా పోలీసులు వెల్లడించారు. వారు రాసిన లేఖ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.




# వణికిస్తున్న బాస్

**కొత్త స్కామ్‌తో కంపెనీలకు ముప్పు**

- సీఈవోల పేర్లతో ఉద్యోగులను బురిడీ కొడుతున్న సైబర్ కేటుగాళ్లు
- వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా మాల్‌వేర్ దాడులు
- కంపెనీ ఖాతాల నుంచి కోట్ల రూపాయలు కాజేస్తున్న నేరగాళ్లు
- అప్రమత్తంగా ఉండాలని ఐ4సీ హెచ్చరిక

**న్యూఢిల్లీ, జూన్ 23:** సైబర్ నేరగాళ్లు రోజు రోజుకూ కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. వ్యక్తిగత ఖాతాలను లక్ష్యంగా చేసుకునే మోసాలకు తోడు ఇప్పుడు పెద్ద కంపెనీలనే టార్గెట్ చేస్తున్నారు. 'బాస్ స్కామ్' పేరుతో జరుగుతున్న ఈ కొత్త తరహా మోసాల్లో కంపెనీల సీఈవోలు, ఉన్నతాధికారుల పేర్లను ఉపయోగించి ఉద్యోగులను మభ్యపెట్టి భారీ మొత్తాలను కాజేస్తున్నారు. ఈ తరహా మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) హెచ్చరికలు జారీ చేసింది. సాధారణంగా కంపెనీల్లోని కీలక అధికారులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ముందుగా వల వేస్తారు. ఆర్‌బీఐ వంటి ప్రభుత్వ సంస్థల పేర్లతో వాట్సాప్ లేదా ఈ-మెయిల్ ద్వారా సందేశాలు పంపిస్తారు. ఆ సందేశాల్లో ఉండే జిప్ ఫైల్‌ను తెరిచిన వెంటనే మాల్‌వేర్ సిస్టమ్‌లోకి ప్రవేశిస్తుంది.

### అధికారిక కమ్యూనికేషన్లపై నిఘా

మాల్‌వేర్ ద్వారా నేరగాళ్లు వాట్సాప్ వెబ్ సెషన్లను హ్యాక్ చేసి కంపెనీ అంతర్గత సమాచారాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంటారు. అధికారులు, ఉద్యోగుల మధ్య జరిగే కమ్యూనికేషన్‌ను గమనిస్తూ సరైన అవకాశాన్ని ఎదురు చూస్తారు. ఆ తర్వాత సీఈవో లేదా ఉన్నతాధికారుల అధికారిక నంబర్ల నుంచే ఫైనాన్స్ విభాగానికి అత్యవసరంగా డబ్బులు బదిలీ చేయాలంటూ సందేశాలు పంపిస్తారు. ఆదేశాలు నిజమని భావించిన సిబ్బంది పెద్ద మొత్తాలను బదిలీ చేయడంతో కంపెనీలు భారీ నష్టాలను ఎదుర్కొంటున్నాయి. సైబర్ నిపుణుల సూచనల ప్రకారం, డబ్బులు పంపాలని లేదా ఖాతా వివరాలు మార్చాలని పై అధికారుల పేరుతో సందేశం వస్తే తప్పనిసరిగా నేరుగా ఫోన్ చేసి ధృవీకరించుకోవాలి. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫైల్స్, అటాచ్‌మెంట్లను తెరవకూడదు. ప్రభుత్వ సంస్థలు వాట్సాప్ ద్వారా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు పంపవని గుర్తుంచుకోవాలి. అలాగే వాట్సాప్‌లో అనుమానాస్పదంగా ఇతర పరికరాలు అనుసంధానమై ఉన్నాయేమో తరచూ తనిఖీ చేయాలి. కంప్యూటర్లు, మొబైల్ పరికరాల్లో తాజా యాంటీ మాల్‌వేర్ భద్రతా వ్యవస్థలను ఉపయోగించడం ద్వారా ఇటువంటి మోసాల నుంచి రక్షణ పొందవచ్చని ఐ4సీ సూచించింది.

# 60 ఏళ్ల ప్రయాణంలో
# శివసేన అంతర్ధాన దశ

**ఉద్ధవ్ స్వయంకృతంతో పార్టీకి ముప్పు**

**తండ్రి ఆశయాలు కాపాడడంలో పూర్తిగా విఫలం**

**ముంబై, జూన్ 23 :** మహారాష్ట్రలో బలంగా నిలిచిన శివసేన కథ ఇంక కంచికేనా అన్న చర్చ సాగుతోంది. బాణంలా దూసుకుని వచ్చిన బాల్ ఠాక్రే స్థాపించిన 'శివసేన' సరిగ్గా 60 వసంతాలు పూర్తి చేసుకుని వజ్రోత్సవ వేడుకలకు సిద్ధం అవుతున్న వేళ..అంతర్ధానానికి దగ్గరవుతోంది. యాదృచ్ఛికమే అయినా 60 వసంతాల పార్టీ ఇలా కావడం స్వయంకృతమే. 1966 జూన్ 19న ముంబైలోని చారిత్రాత్మక శివాజీ పార్క్‌లో బాల్ ఠాక్రే కొబ్బరికాయ కొట్టి ఈ పార్టీని ప్రారంభించారు. నాడు కొద్దిమంది మద్దతుదారులు, వేలాది మంది 'మరాఠీ మానుస్' సాక్షిగా పురుడుపోసుకున్న ఈ ప్రాంతీయ మహావృక్షం.. రెక్కలు విరిగాయి. నేలకొరగడానికి సిద్ధంగా ఉంది. విచిత్రమేమిటంటే.. బాల్ ఠాక్రే స్థాపించిన అసలైన 'శివసేన' పేరు, దాని సాంప్రదాయక 'విల్లు-బాణం' గుర్తు ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే వశమయ్యాయి. మరోవైపు ఉద్ధవ్ ఠాక్రే వద్ద తండ్రి పెట్టిన పార్టీ పేరు కానీ, గుర్తు కానీ మిగల్లేదు. వారి పార్టీ ఇప్పుడు 'శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే)'గా రూపాంతరం చెంది, 'మశాల్' (దివిటీ) గుర్తుతో మనుగడ సాగిస్తోంది. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆ దివిటీ సైతం దాదాపు ఆరిపోయే స్థితికి చేరుకుంది. శివసేనను స్థాపించినప్పుడు బాల్ ఠాక్రే రెండు ప్రధాన ఆశయాలను నిర్దేశిరచుకున్నారు. ఒకటి 'మరాఠీ అస్తిత్వం', రెండోది 'హిందుత్వ సిద్ధాంతం'. కానీ నేడు ఉద్ధవ్ ఠాక్రే తన తండ్రి నుంచి వచ్చిన ఈ రెండు రాజకీయ వారసత్వాలను కాపాడుకోవడానికి తీవ్రంగా పోరాడాల్సి వస్తోంది. బాల్ ఠాక్రే హయాంలో శివసేన సాధించిన శిఖరాగ్రాల నుంచి ఉద్ధవ్ హయాంలో ఎదుర్కొంటున్న జీవన్మరణ పరిస్థితి వరకు అనేక ఆటుపోట్లు ఎదుర్కొంది. 1992 జూలై 18న శివసేనలో జరిగిన ఘటన సంచనలంగా మారింది. బాల్ ఠాక్రే పార్టీని ఒక సొంత ఆస్తిలా చూస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో కలత చెందిన బాల్ ఠాక్రే, పార్టీ ముఖపత్రం 'సామ్నా'లో ఒక వ్యాసం



రాస్తూ.. తాను శివసేన నుంచి తప్పుకుంటున్నట్లు సంచలన ప్రకటన చేశారు. ఈ వార్తతో మహారాష్ట్రవ్యాప్తంగా ఉన్న శివసైనికుల్లో తీవ్ర కలకలం రేగింది. ముంబైలోని శివసేన ప్రధాన కార్యాలయం వెలుపల లక్షలాది మంది సైనికులు తరలివచ్చి.. 'బాలాసాహెబ్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి' అని కన్నీటితో వేడుకున్నారు. శివసైనికులకు తనపై ఉన్న ఆ అచంచలమైన ప్రేమాభిమానాలను చూసి బాల్ ఠాక్రే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోక తప్పలేదు. బాల్ ఠాక్రే బతికున్నంత కాలం మహారాష్ట్ర రాజకీయాలకు కేంద్ర బిందువు వారి నివాసమైన 'మాతోశ్రీ' మాత్రమే. శివసేన అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. ముంబై నగర రిమోట్ కంట్రోల్ బాలాసాహెబ్ చేతుల్లోనే ఉండేది. 'మాతోశ్రీ' నుంచి చిన్న సంకేతం వస్తే చాలు.. ముంబై స్థంభించిపోయేది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం స్వయంగా ముంబై పోలీసులు సైతం శివసేన ప్రముఖుడిని అభ్యర్థించాల్సిన పరిస్థితి ఉండేది. కోవిడ్ లాక్‌డౌన్ కంటే ముందే.. ముంబై లోకల్ రైళ్లకు బ్రేక్ వేయగల ఏకైక శక్తి బాల్ ఠాక్రేకే ఉండేదని ఇప్పటికీ ముంబై ప్రజలు చెప్పుకుంటారు. కానీ, నేడు బాల్ ఠాక్రే శతాబ్ది జయంతి ఉత్సవాల వేళ, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని పార్టీ రెండోసారి ఘోరమైన చీలికను ఎదుర్కొంటోంది. ఆయన కుడిభుజం లాంటి సంజయ్ రౌత్ కేవలం ప్రత్యర్థులపై వీధి రౌడీల తరహాలో విమర్శలు చేయడానికే పరిమితమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాల్ ఠాక్రేకు, ఉద్ధవ్ ఠాక్రేకు రాజకీయ వ్యూహాల్లోనూ, వ్యక్తిత్వంలోనూ నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. బాల్ ఠాక్రే తన జీవితంలో ఎన్నడూ అధికార పీఠాన్ని ఆశించలేదు. ఆయన ఎప్పుడూ 'కింగ్' అవ్వాలని అనుకోలేదు, 'కింగ్‌మేకర్' గానే ఉండటానికి ఇష్టపడ్డారు. శివసైనికులు బాలాసాహెబ్ కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధపడ్డారంటే.. ఆయన దశాబ్దాల పాటు క్షేత్ర-స్థాయిలో చేసిన పోరాటమే దానికి కారణం. 2003 నుంచి పార్టీలో ఉద్ధవ్ జోక్యం పెరిగిన తర్వాత, శివసేన ఏకంగా నాలుగు సార్లు పెద్ద తిరుగుబాట్లను చవిచూసింది. ఉద్ధవ్‌పై తిరుగుబాటు చేసిన ప్రతి ఒక్కరి వాదన ఒక్కటే.. ఆయనలో బాల్ ఠాక్రే లక్షణాలు ఏమాత్రం లేవని, అయినా సరే అందరూ తనను బాలాసాహెబ్‌లాగే గౌరవించాలని ఉద్ధవ్ ఆశిస్తారని అసమ్మతి నేతలు ఆరోపిస్తుంటారు. బీజేపీతో కలిసి ఎన్నికల్లో గెలిచిన తర్వాత, ఉద్ధవ్ ఠాక్రే అనూహ్యంగా ప్లేట్ ఫిరాయించి కాంగ్రెస్, ఎన్సీపీలతో చేతులు కలిపి స్వయంగా ముఖ్యమంత్రి అయ్యారు. అంతేకాకుండా తన సొంత మంత్రివర్గంలో కొడుకు ఆదిత్య ఠాక్రేకు మంత్రి పదవి కట్టబెట్టారు. ఉద్ధవ్ నిర్ణయాలపై ఆయన భార్య రష్మి ఠాక్రే, కుమారుడు ఆదిత్య ఠాక్రే, సంజయ్ రౌత్‌లతో కూడిన ఒక ప్రత్యేక కోటరీ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ఇది బాలాసాహెబ్ ఇమేజ్ ముందు ఉద్ధవ్‌ను బలహీనంగా మార్చేసిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తారు. బాల్ ఠాక్రే బతికుండగానే జరిగిన మొదటి తిరుగుబాటు ఇది. భుజబల్ ఆ తర్వాత కాంగ్రెస్, ఎన్సీపీల ద్వారా రాజకీయాల్లో కొనసాగారు. విచిత్ర మేమిటంటే, ఆ తర్వాత కాలంలో అదే భుజబల్‌ను ఉద్ధవ్ తన మంత్రివర్గంలో చేర్చుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు ఏక్‌నాథ్ షిండేతో మొత్తం శివసేన రూపం మారిపోయింది. అసపలు శివసేనకు షిండే నాయకుడయ్యారు. ఇటీవల ఆరుగురు ఎంపీలు కూడా వెళ్లిపోవడంతో ఉద్ధవ్ శివసేన మరింత బలహీనపడింది.



# యుద్ధం ముందున్న స్థితికి హర్మూజ్ ఎప్పటికీ తిరిగిరాదు : ఘాలిబఫ్

**ఇరాన్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతోన్న తరుణంలోనూ.. హర్మూజ్ జలసంధిపై అమెరికా, ఇరాన్ తరచూ ఏదో ఒక ప్రకటన చేస్తూనే ఉన్నాయి. హర్మూజ్ నిర్వహణను ఇరానే చూస్తుందని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ జలసంధి.. యుద్ధానికి ముందున్న స్థితికి ఎప్పటికీ తిరిగిరాదన్నారు. "మేం అమెరికన్లను ఎన్నడూ నమ్మలేదు. ఇప్పుడూ నమ్మడం లేదు. భవిష్యత్తులోనూ వారిపట్ల ఆ ధోరణితో ఉండటం సమంజసమే" అని ఘాలిబఫ్ అమెరికా పట్ల ఇరాన్‌కున్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. స్విట్జర్లాండ్‌లో ఇప్పటికే రెండు దేశాల మధ్య చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఫ్రీజ్ చేసిన 12 బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తులను విడుదల చేయడానికి తుది ఒప్పందం కుదిరిందని ఆయన పేర్కొన్నారు. కాగా.. తమ నుంచి సోయా, మొక్కజొన్న, గోధుమలు కొనేందుకు ఇరాన్ అంగీకరిస్తే.. ఫ్రీజ్ చేసిన ఆ దేశ ఆస్తులను విడుదల చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్మూజ్‌పై భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ పూర్తిగా తెరిచే ఉందని ప్రకటించారు. ఈ జలసంధికి మరోవైపున ఉన్న ఒమన్ దేశం తాజా పరిణామాలపై స్పందించింది. అంతర్జాతీయ చట్టాలకు, టోల్ రహిత ప్రయాణానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించింది. ఇరాన్-అమెరికా మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంపై నిర్మాణాత్మక చర్చలు జరిగాయని పేర్కొంది.

## అమెరికా పౌరసత్వం మరింత ఖరీదు

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టి నప్పటి నుంచి ఇమిగ్రేషన్ రూల్స్‌ను కఠినతరం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన కార్యవర్గం చేసిన ప్రతిపాదనలతో అమెరికా పౌరస త్వం మరింత ఖరీదుగా మారనుం ది. పౌరసత్వ దరఖాస్తుల ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెం చాలని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ ప్రతిపాదించింది. సక్రమ మార్గంలో వచ్చి న వలసదారులు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకుంటే.. ప్రాసెసింగ్, వెట్టింగ్ ఖర్చులు భరించాల్సి రావడంతో పాటు ఇప్పటివరకు ఉన్న పలు మినహాయింపులను కూడా కోల్పోనున్నారు. పౌరసత్వ దరఖాస్తు (పేపర్ బేస్డ్) ఫైల్ చేయడానికి ఫీజు 760 డాలర్ల నుంచి 1330 డాలర్లకు పెరగనుంది. ఆన్‌లైన్ దరఖాస్తు విషయానికొస్తే.. 710 డాలర్ల నుంచి 1280 డాలర్లకు ఫీజు పెంపును అధికారులు ప్రతిపాదించారు. ఈ కొత్త ఫీజులు అమల్లోకి వస్తే.. 75 శాతం మేర భారం పడనుంది. ఏదైనా సిటిజన్‌షిప్ అప్లికేషన్ తిరస్కరణకు గురైతే.. దానిని తిరిగి పరిశీలించాలని కోరినా సరే.. ఖర్చుల మోత మోగనుంది. ఆ రుసుము 830 డాలర్ల నుంచి 1475 డాలర్లకు అంటే 645 డాలర్ల మేర పెరగనుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదిత నిబంధనలపై 60 రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారు. అలాగే అమెరికాలో ఆదాయ ఆధారిత మార్గదర్శకాల ప్రకారం.. దరఖాస్తుదారులకు ప్రస్తుతం లభిస్తోన్న మినహాయింపులను తొలగించాలని డీహెచ్ఎస్ ప్రతిపాదించింది. 400 శాతం లేక అంతకంటే తక్కువ ఆదాయం ఉన్న దరఖాస్తుదారులకు రెడ్యూస్‌డ్ ఫీజ్ ఆప్షన్‌ను తీసేయాలని సూచించింది. ఈ కొత్త రూల్స్ వల్ల సహజంగా పౌరసత్వం పొందడానికి అర్హత ఉన్న శాశ్వత నివాసితులు.. తమకున్న అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# పాక్, ఖతార్‌లను నమ్మలేం

**ఉగ్రవాదానికి ఊతమిచ్చిన ఘనత వారిది**

**బిన్‌లాడెన్‌ను దాచిపెట్టిన చరిత్ర పాక్‌ది**

**జెడి వాన్స్ వ్యాఖ్యలపై ఇద్దరు సెనేటర్ల విమర్శలు**

**వాషింగ్టన్, జూన్ 23 :** పాకిస్థాన్‌పై ప్రేమను వ్యక్తం చేస్తూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై అమెరికాకు చెందిన ఇద్దరు సెనేటర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ దేశ ఉగ్రచరిత్ర గురించి ప్రస్తావిస్తూ, బిన్ లాడెన్‌ను దాచిన ఘనత పాక్‌దని అన్నారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్, ఖతార్ దేశాలపై అమెరికాకు చెందిన ఇద్దరు రిపబ్లికన్ సెనేటర్లు రిక్ స్కాట్, టిమ్ షీహీ ఘాటుగా స్పందించారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన చరిత్ర ఆ దేశాలకు ఉందంటూ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. కాగా, అమెరికా- ఇరాన్ శాంతి ఒప్పందానికి సంబంధించిన సాంకేతిక వివరాలపై స్విట్జర్లాండ్‌లో ఇటీవల చర్చలు జరిగాయి. ఈ సమావేశానికి పాకిస్థాన్, ఖతార్ నాయకులతో వాన్స్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 'మేము పాకిస్తాన్‌ను ప్రేమిస్తున్నాం' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. అయితే, ఈ చర్చల్లో పాకిస్థాన్, ఖతార్‌లను నిష్పక్షపాత మధ్యవర్తులుగా చూడకూడదని సెనేటర్ రిక్ స్కాట్ తేల్చి చెప్పారు. మధ్యప్రాచ్యంలో యూఏఈ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలే వాషింగ్టన్‌కు నిజమైన మిత్రదేశాలని పేర్కొన్నారు. ఆ దేశాలనూ అమెరికా చర్చల్లో చేర్చుకోవాలని స్కాట్ సూచించారు. 'మన నిజమైన స్నేహితులు ఎవరో ఇప్పటికే అందరికీ స్పష్టంగా తెలిసి ఉండాలి. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన సుదీర్ఘ చరిత్ర ఖతార్, పాకిస్థాన్‌లకు ఉంది. ప్రస్తుతం వారు అర్థవంతమైన శాంతిని సాధించడం కంటే ఇరాన్ దశాబ్దాల నాటి ఉగ్రవాద ప్రచారాన్ని ప్రోత్సహించడానికే మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోంది. అందరికీ ప్రయోజనం చేకూర్చే ఆచరణీయమైన ఒప్పందానికి ఇంకా ఆస్కారం ఉంది' అని ఆయన చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా మోంటానా సెనేటర్ టిమ్ షీహీ కూడా పాకిస్థాన్‌ను విమర్శించారు. 'పాకిస్థాన్ ఒక దశాబ్దం పాటు బిన్ లాడెన్‌కు ఆశ్రయం ఇచ్చిందనే విషయాన్ని మనం మరిచిపోకూడదు. పాకిస్థానీలు ఐఎస్ఐ ద్వారా మాపై పోరాడే వారికి నిధులు సమకూర్చారు. ముఖ్యంగా అయతుల్లాకు నిధులు అందించారు. ఖతార్ కూడా దశాబ్దాలుగా ఉగ్రవాద సంస్థలకు మనీలాండరింగ్ ద్వారా డబ్బును అందిస్తోంది. ఇరాన్, అమెరికా- ఇజ్రాయెల్ శాంతి ఒప్పందంలో పాకిస్థాన్, ఖతార్‌లు పాల్గొంటే.. ఆ చర్చల్లో యూఏఈ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలనూ చేర్చుకోవాలి. మధ్యప్రాచ్యంలో ఆ మూడు దేశాలే అమెరికాకు నిజమైన మిత్రదేశాలు' అని పేర్కొన్నారు. కాగా, వీరి వ్యాఖ్యలు ఇప్పటికే ఉన్న వివాదానికి మరింత ఆజ్యం పోసినట్లు అయ్యింది.



## హర్మూజ్‌పై పట్టుకోసం
# ఇరాన్ బెట్టు

**అమెరికన్లను ఎప్పుడూ నమ్మబోమన్న ఇరాన్**

**టెహ్రాన్, జూన్ 23 :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతోన్న తరుణంలోనూ.. హర్మూజ్ జలసంధిపై అమెరికా, ఇరాన్ తరచూ ఏదో ఒక ప్రకటన చేస్తూనే ఉన్నాయి. హర్మూజ్ నిర్వహణను ఇరానే చూస్తుందని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ జలసంధి.. యుద్ధానికి ముందున్న స్థితికి ఎప్పటికీ తిరిగిరాదన్నారు. మేం అమెరికన్లను ఎన్నడూ నమ్మలేదు. ఇప్పుడూ నమ్మడం లేదు. భవిష్యత్తులోనూ వారిపట్ల ఆ ధోరణితో ఉండటం సమంజసమే అని ఘాలిబఫ్ అమెరికా పట్ల ఇరాన్‌కున్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. స్విట్జర్లాండ్‌లో ఇప్పటికే రెండు దేశాల మధ్య చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఫ్రీజ్ చేసిన 12 బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తులను విడుదల చేయడానికి తుది ఒప్పందం కుదిరిందని ఆయన పేర్కొన్నారు. కాగా.. తమ నుంచి సోయా, మొక్కజొన్న, గోధుమలు కొనేందుకు ఇరాన్ అంగీకరిస్తే.. ఫ్రీజ్ చేసిన ఆ దేశ ఆస్తులను విడుదల చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్మూజ్‌పై భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ పూర్తిగా తెరిచే ఉందని ప్రకటించారు. ఈ జలసంధికి మరోవైపున ఉన్న ఒమన్ దేశం తాజా పరిణామాలపై స్పందించింది. అంతర్జాతీయ చట్టాలకు, టోల్ రహిత ప్రయాణానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించింది. ఇరాన్-అమెరికా మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంపై నిర్మాణాత్మక చర్చలు జరిగాయని పేర్కొంది.

# నీట్‌తో విద్యార్థుల్లో గందరగోళం

- హిందీ మనకు అసవరం లేదు
- తమిళం, ఇంగ్లీస్ సరిపోతుంది
- కుటుంబ పార్టీలకు తాము వ్యతిరేకం
- ఎన్నో అవమానాలు ఎదుర్కొని ఇక్కడికి వచ్చా
- కరూర్ తొక్కిసలాట ఘటన మరచిపోలేని విషాదం
- అసెంబ్లీలో సిఎం విజయ్ కీలక ప్రసంగం

**చెన్నై, జూన్ 23 :** తమిళనాడు విద్యార్థుల్లో నీట్ అసమానతల్ని సృష్టిస్తోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ అన్నారు. అసమానతలకు కారణమైన నీట్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమిళనాడు అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ మంగళవారం కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా హిందీ వివాదం, నీట్, కరూర్ తొక్కిసలాట ఘటన వంటి పలు అంశాలను ప్రస్తావించిన విజయ్ విమర్శకులకు గట్టిగా బదులిచ్చారు. ఈ మేరకు అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందీ భాషనూ వ్యతిరేకించారు. తమిళం, ఇంగ్లీష్‌లతో కూడిన ద్విభాషా విధానానికే తాము కట్టుబడి ఉంటామన్నారు. నీట్ వల్ల సామాజిక అసమానతలు పెరుగు తున్నాయని సీఎం విజయ్ చెప్పుకొచ్చారు. విద్యార్థులపై తీవ్ర మానసిక ఒత్తిడి తెస్తున్న ఈ పరీక్షను రద్దుచేసి, ఇంటర్ మార్కుల ఆధారంగా వైద్య సీట్లను కేటాయించాలని తమిళనాడు చాలా కాలంగా కోరుతోందని ఆయన గుర్తుచేశారు. హిందీ భాషపైనా స్పందిస్తూ.. తమిళం రాష్ట్ర భాషగా, ఇంగ్లీష్ అంతర్జాతీయ భాషగా సరిపోతాయని తన వైఖరిని స్పష్టం చేశారు. మూడో భాషను బలవంతంగా రుద్దాల్సిన అవసరంలేదని, రెండు భాషల విధానమే కొనసాగుతుందని తేల్చి చెప్పారు. తమ పార్టీని విమర్శించే వారికి ఈ సందర్భంగా గట్టిగా సమాధాన మిచ్చారు సీఎం విజయ్. ప్రజల మద్దతుతోనే తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధికారంలోకి వచ్చిందన్న ఆయన.. దీని వెనుక ఎన్నో కుట్రలు, సవాళ్లను ఎదుర్కొ న్నామన్నారు. 'జనం గుండెల్లో స్థానం



సంపాదించడం అంత సులువు కాదు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే ఇక్కడకు వచ్చాం. అయినప్పటికీ కొందరు 'నటుడి పార్టీ' అనే విమర్శలు గుప్పిస్తున్నారు. వాటన్నింటినీ మేం పట్టించుకోం. మా రాజకీయాలు పారదర్శకంగా ఉంటాయని విజయ్ చెప్పుకొచ్చారు. అలాగే కుటుంబ రాజకీయాలపై ఆయన మాట్లాడుతూ.. 'మా రాజకీయాలు ఒక్క కుటుంబం కోసమే కాదు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం మాదే. అదే మా పాలన.. అదే మా లక్ష్యం' అని స్పష్టం చేశారు. ప్రసంగంలో భాగంగా ఎన్నికల ప్రచార సమయంలో చోటుచేసుకున్న కరూర్ తొక్కిసలాట ఘటనను విజయ్ ప్రస్తావించారు. 41 మంది ప్రాణాలు కోల్పోయిన ఆ విషాద ఘటన నన్ను ఎంత వేదనకు గురిచేసిందో మాటల్లో చెప్పలేను. ఆ బాధ నన్ను ఎన్నటికీ వదలదు. ఆ ఘటన విషయం లోనూ మాపైనే నిందలేశారు. ఇది అత్యంత దారుణం. రాజకీయాలు ఇంత క్రూరంగా ఉంటాయా అని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారసత్వ రాజకీయాల గురించి స్పందిస్తూ డీఎంకేపై విజయ్ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. డీఎంకేను ఉద్దేశిస్తూ కేవలం ఒక కుటుంబానికే ప్రాధాన్యమివ్వడం మా రాజకీయ విధానం కాదు. తమిళనాడులోని ప్రతి కుటుంబానికి మా సేవలందిస్తాం. అదే మా రాజకీయం. అదే మా పాలనా విధానమని విజయ్ పేర్కొన్నారు.

## అమెరికా పౌరసత్వం మరింత ఖరీదు

**ఫైలింగ్ ఫీజులను 75శాతం పెంచే యోచన**

**వాషింగ్టన్, జూన్ 23 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇమిగ్రేషన్ రూల్స్‌ను కఠినతరం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన కార్యవర్గం చేసిన ప్రతిపాదనలతో అమెరికా పౌరసత్వం మరింత ఖరీదుగా మారనుంది. పౌరసత్వ దరఖాస్తుల ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెంచాలని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ ప్రతిపాదించింది. సక్రమ మార్గంలో వచ్చిన వలసదారులు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకుంటే.. ప్రాసెసింగ్, వెట్టింగ్ ఖర్చులు భరించాల్సిరావడంతో పాటు ఇప్పటివరకు ఉన్న పలు మినహాయింపులను కూడా కోల్పోనున్నారు.

ఆంధ్ర మనం

బుధవారం జూన్ 24 2026

## చెస్ టోర్నమెంట్లో విజయనగరం క్రీడాకారుడు కెవి జ్వాలాముఖి ప్రతిభ

### పీహెచ్సీ విభాగంలో ద్వితీయ స్థానం.

**విజయనగరం, జూన్ 23, ఆంధ్ర మనం**



ఏడున్నర . మూడు రోజులు హైదరాబాదులో నిర్వహించిన 2 దేనిస్ ఇంటర్నేషనల్ ఫీడ్ రేటెడ్ చెస్ టోర్నమెంట్ లో విజయనగరం చెందిన కె.వి జ్వాలాముఖి ప్రతిభ కనబరిచారు. పీహెచ్ సి విభాగంలో ద్వితీయ బహుమతి సాధించి 6000 రూపాయల నగదు తో పాటు ట్రోఫీని కూడా గెలుచుకున్నారు. ఈ టోర్నమెంట్లో 680 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మరియు నాలుగు దేశాల నుండి అమెరికా, స్వీడన్, జపాన్ మరియు భారతదేశం నుండి క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. ఆద్యంతము ఉత్సాహము ఉల్లాసపరితంగా ఈ పోటీలు సరోవర్ ఇండోర్ స్టేడియం ఎల్బీనగర్ హైదరాబాదులో జరిగాయి. ఈ పోటీల్లో విజయనగరం జిల్లాలో ఉన్న ప్రముఖ చదరంగం క్రీడాకారులు పాల్గొని మన జిల్లాకి ఎంతో పేరు తీసుకుని వచ్చారని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కేకే జగన్నాథ, ఏ డి ఎన్ఎస్ వి ప్రసాద్ అందరినీ అభినందించారు .<

## డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ కి ఘన నివాళులు

**కూర్మన్నపాలెం , విశాఖపట్నం, జూన్ 23, ఆంధ్ర మనం. :**



డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా విశాఖపట్నంలోని కూర్మన్న పాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ బీజేపీ మీడియా కోఆర్డినేటర్ వెన్నా శ్రీరామమూర్తి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత, జాతీయత కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాల కోసం ఆయన చేసిన త్యాగం ప్రతి భారతీయుడికి ఆదర్శప్రాయమని అన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణంరాజు,వెంకట్రావు,ద్వారపూడి అప్పలరాజు బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు .

## భూసేకరణ ప్రాజెక్టుల పురోగతిపై జేసీ సమీక్ష

**విజయనగరం, జూన్ 23, ఆంధ్ర మనం :**



జిల్లాలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు స ంబ ంధించిన భూసేకరణ పనుల పురోగతిపై జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధ వ న్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, తారకరామ తీర్థసాగరం, తోటపల్లి బ్యారేజ్, జాతీయ రహదారులు, రైల్వే లైన్లు, రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, భోగాపురం విమానాశ్రయం, పారిశ్రామిక మరియు రక్షణ రంగ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ అంశాలను పరిశీలించారు. పెండింగ్లో ఉన్న భూసేకరణ, పరిహారం చెల్లింపులు, అవార్డు ప్రక్రియలను వేగవంతం చేసి ప్రాజెక్టుల అమలుకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జేసీ ఆదేశించారు. రైతులు, భూ యజమానులతో సమన్వయం పాటిస్తూ నిర్ణీత గడువుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.

## ఆర్టీఐ పేరుతో మోసాల ఆరోపణలు.. డీజీపీకి లేఖ రాసిన సమాచార కమిషన్

**విజయవాడ, జూన్ 23 ఆంధ్ర మనం :**

అమరావతి: సమాచార హక్కు చట్టం పేరుతో భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేయడం, ప్రభుత్వ రికార్డులను అక్రమంగా తన వద్ద ఉంచుకోవడం, వ్యక్తులను మోసం చేయడం వంటి ఆరోపణలపై తిరుపతికి చెందిన పి. జయచంద్రారెడ్డిపై సమగ్ర విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ వజ్జా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ డీజీపీకి లేఖ రాసింది. ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ కార్యదర్శి, ప్రధాన సమాచార కమిషనర్ ఆమోదంతో డీజీపీకి పంపిన లేఖలో పి. జయచంద్రారెడ్డిపై వచ్చిన ఫిర్యాదుల వివరాలను ప్రస్తావించారు. వుయ్యూరు లలితాదేవి అనే మహిళ చేసిన ఫిర్యాదు ప్రకారం, భూ రికార్డులకు సంబంధించిన సమాచారం ఆర్టీఐ ద్వారా ఇప్పిస్తానని చెప్పి జయచంద్రారెడ్డి భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేశారని, గణనీయమైన మొత్తాన్ని తీసుకున్నప్పటికీ సంబంధిత రికార్డులు అందించలేదని ఆరోపించారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, ఆర్టీఐ దరఖాస్తులు, అప్పీలు దాఖలు చేసి కొన్ని రికార్డులు పొందినప్పటికీ వాటిని ఫిర్యాదుదారురాలికి అందించకుండా తన వద్దే ఉంచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా ఆయన కార్యాలయంలో పెద్ద మొత్తంలో రెవెన్యూ రికార్డులు, ఇతర ప్రభుత్వ పత్రాలు ఉన్నట్లు కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే అంశంపై బి. చంద్రయ్య అనే మరో వ్యక్తి కూడా సమాచార కమిషన్కు ఫిర్యాదు చేశారు. సమాచారం ఇప్పిస్తానని చెప్పి తన నుంచి రూ.20 వేల రూపాయలు తీసుకున్నప్పటికీ ఎలాంటి రికార్డులు అందించలేదని ఆయన ఆరోపించారు. ఒకటి కంటే ఎక్కువ ఫిర్యాదులు రావడం, ఆర్టీఐ వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉండటంతో ఈ వ్యవహారాన్ని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ వజ్జా శ్రీనివాసరావు సీరియస్గా తీసుకున్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా దీనిని సుమోమోటోగా పరిశీలించి పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని ఆదేశించారు. దీంతో ప్రధాన సమాచార కమిషనర్ ఆదేశాల మేరకు డీజీపీకి లేఖ రాసిన సమాచార కమిషన్, ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. విచారణలో ఆరోపణలు నిజమని తేలితే జయచంద్రారెడ్డి వద్ద ఉన్న ప్రభుత్వ రికార్డులు, రెవెన్యూ పత్రాలను స్వాధీనం చేసుకుని సంబంధిత శాఖలకు అప్పగించాలని కూడా సూచించింది. ఆర్టీఐ చట్టం ప్రజలకు తక్కువ ఖర్చుతో సమాచారం అందించేందుకు రూపొందించబడిందని, చట్టంలో నిర్దేశించిన ఫీజులు తప్ప అదనపు మొత్తాలు వసూలు చేయడం చట్ట విరుద్ధమని సమాచార కమిషన్ స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై పోలీసు విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## వైసీపీ కాపు సభ కాదు – రాజకీయ నిరుద్యోగుల ఆర్తనాద సభ

**సానా సతీష్ బాబు**

**విజయవాడ, జూన్ 23 ఆంధ్ర మనం**



కాకినాడ జిల్లాలో ఇటీవల నిర్వహించిన కాపు సభ అసలు కాపుల ఆత్మీయ సమావేశం కాదని, అది పూర్తిగా రాజకీయ నిరుద్యోగుల ఆర్తనాద సభేనని టీడీపీ రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు అన్నారు రాష్ట్ర సచివాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రెస్ మీట్లో ఆయన మాట్లాడుతూ, కాపులపై నిజమైన ప్రేమతో కాకుండా రాజకీయ లబ్ధి కోసం వైసీపీ నేతలు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి "కాపులకు రిజర్వేషన్లు అవసరం లేదు" అని ప్రకటించినప్పుడు వైసీపీ నేతలు ఎందుకు మౌనం వహించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 2014–19 మధ్య నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాపులకు ఇచ్చిన 5% EWS రిజర్వేషన్ను జగన్ ప్రభుత్వం రద్దు చేసినప్పుడు కూడా కాపు నాయకులు స్పందించలేదని ప్రశ్నించారు. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 27 కాపు భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టి, 80% పనులు పూర్తి చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, మిగిలిన పనులను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసినప్పుడు కాపు నాయకులు ఏమి చేశారని ప్రశ్నించారు. వైసీపీకి తెలిసింది కేవలం కుల రాజకీయాలేనని సానా సతీష్ బాబు విమర్శించారు. ఎక్కడైనా మరణం జరిగినా అక్కడికి వెళ్లి రాజకీయాలు చేయడం వారి అలవాటైందని ఆరోపించారు. ఇటీవల జరిగిన లాకప్ డెత్ ఘటనను కూడా కుల రాజకీయాలకు వాడుకునే ప్రయత్నం చేశారని అన్నారు. కోనసీమలో ప్రశాంత వాతావరణాన్ని జగన్ ప్రభుత్వం కుల చిచ్చుతో దెబ్బతీసిందని, ఆ సమయంలో 160 మంది కాపు యువకులను అరెస్టు చేసినా వైసీపీ నేతలు స్పందించలేదని విమర్శించారు. ఇప్పుడు అదే నేతలు కాపుల పేరుతో సభలు నిర్వహించడం సిగ్గుచేటని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వాస్తవాలు మాట్లాడితే వైసీపీ నేతలు ఎందుకు స్పందిస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని, కుల రాజకీయాలను ప్రజలు నమ్మరని అన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి పిటిషన్స్ కమిటీ కట్టుబడి ఉంది

- **విలేకరుల సమావేశంలో ఏపీ శాసనసభ పిటిషన్స్ కమిటీ ఛైర్మన్ కె. రఘురామకృష్ణంరాజు**
- **గాజువాక సమస్యలపై ప్రత్యేక దృష్టి - పరిష్కారాలకు నిర్దిష్ట గడువులు: ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు**

**విశాఖపట్నం, జూన్ 23, ఆంధ్ర మనం**



ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర శాసనసభ పిటిషన్స్ కమిటీ నిర్వహించిన సమావేశం అత్యంత ఫలప్రదంగా జరిగిందని కమిటీ ఛైర్మన్ కె. రఘురామకృష్ణంరాజు తెలిపారు. ముఖ్యంగా గాజువాక నియోజకవర్గానికి సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలపై ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సమర్పించిన 14 పిటిషన్లను సమావేశంలో సవివరంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో విస్తృతంగా చర్చించినట్లు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ మీటింగు హాలులో అధికారులతో సమీక్షించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాల గురించి వివరించారు. కమిటీ సభ్యులు గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, కొణతాల రామకృష్ణలతో పాటు జరిగిన సమావేశంలో ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలను గుర్తించడంతో పాటు, వాటి అమలుకు నిర్దిష్ట కాలపరిమితులను నిర్ణయించడం ప్రత్యేకతగా నిలిచిందన్నారు. సమస్యల పరిష్కారానికి ఎంత సమయం అవసరమో, ఏ శాఖ ఏ విధంగా చర్యలు చేపట్టాలో, అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహించాల్సిన బాధ్యతలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రజా సమస్యలను కమిటీ ముందుంచిన తీరు ప్రశంసనీయమని కమిటీ ఛైర్మన్ రఘురామకృష్ణంరాజు అన్నారు. సమస్యలకు సంబంధించిన బాధితులను కూడా సమావేశానికి తీసుకువచ్చి, వారి ఆవేదనను ప్రత్యక్షంగా కమిటీ దృష్టికి తీసుకురావడం ద్వారా సమస్యల తీవ్రతను అందరూ అర్థం చేసుకునే అవకాశం కలిగిందన్నారు. అధికారులు కూడా మానవతా దృక్పథంతో స్పందించి, సమస్యలకు పరిష్కారం కనుగొనే దిశగా సానుకూలంగా వ్యవహరించారని కమిటీ ఛైర్మన్ తెలిపారు. అధికార పరిమితులు ఉన్నప్పటికీ ప్రజలకు న్యాయం చేయాలనే సంకల్పంతో పనిచేయడం సమావేశ విజయానికి దోహదపడిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్దిష్ట గడువులు నిర్ణయించుకోవడం, లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగడం ద్వారా ప్రజలకు త్వరితగతిన న్యాయం చేయగలమనే విశ్వాసం మరింత బలపడిందన్నారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తే మరింత మెరుగైన పాలన అందించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. సానుకూల వాతావరణంలో జరిగిన ఈ సమావేశం ప్రత్యేకంగా నిలిచిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సమావేశాల ద్వారా ప్రజలకు న్యాయం చేయడానికి పిటిషన్స్ కమిటీ కట్టుబడి ఉందని కమిటీ ఛైర్మన్ కె. రఘురామకృష్ణంరాజు ఉద్ఘాటించారు.

**గాజువాక సమస్యలపై కమిటీ సానుకూల స్పందన ఎమ్మెల్యే పల్లా**

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాకలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న సమస్యలను పిటిషన్స్ కమిటీ దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే కమిటీ ఛైర్మన్ స్పందించి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కమిటీ సభ్యుల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. అధికారులందరూ అన్ని అంశాలపై పూర్తి అవగాహనతో స్పందిస్తూ, కొన్ని సమస్యలను రెండు నెలల బదులు నెల రోజుల్లోనే పరిష్కరించే అవకాశాలను కూడా సూచించారని పేర్కొన్నారు. సమావేశంలో ప్రధానంగా 22ఏ నిషేధిత భూముల జాబితాకు సంబంధించిన అంశంపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో కొన్ని సహకార గృహ నిర్మాణ సంఘాలకు విక్రయించిన స్థలాలు చెరువు గర్భ ప్రాంతాలు లేదా నిషేధిత భూముల పరిధిలో ఉన్నాయని గుర్తించి 22ఏ జాబితాలో చేర్చారని, అయితే ప్రస్తుతం అక్కడ పూర్తి స్థాయిలో నిర్మాణాలు జరిగి ప్రజలు నివసిస్తున్న పరిస్థితిని కమిటీ పరిశీలించిందన్నారు. ప్రస్తుత వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అర్హత ఉన్న ప్రాంతాలను 22ఏ జాబితా నుంచి తొలగించే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ అంశంపై రాబోయే రెండు నుంచి మూడు నెలల్లో స్పష్టమైన పరిష్కారం లభించే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు. గంగవరం పోర్టు, విశాఖ ఉక్కు కర్మాగారానికి సంబంధించిన పలు కీలక అంశాలపై కూడా సమావేశంలో చర్చించామని తెలిపారు. సాధారణ పరిపాలనా స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను పిటిషన్స్ కమిటీ దృష్టికి తీసుకువచ్చి, వాటిపై విధానపరమైన నిర్ణయాలు తీసుకునే దిశగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

## సీఎం పర్యటనకు సర్వం సిద్ధం...

- **ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్**

**కర్నూలు, జూన్ 23 ఆంధ్ర మనం :**



ఈ నెల 25వ తేదీన మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచ్చేయనున్న నేపథ్యంలో సభా ఏర్పాట్లను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, జోనల్ ఇన్చార్జి శ్రీనివాస రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ , మంత్రాలయం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్, సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, భోజన ఏర్పాట్లు, బారికేడింగ్, తాగునీటి సదుపాయాలు, ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలు, పార్టీ నాయకులు, కార్యకర్తల కోసం చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సభకు భారీ సంఖ్యలో రైతులు, మహిళలు, యువత, పార్టీ శ్రేణులు హాజరుకానున్న నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల సౌకర్యాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, జిల్లా, మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకర్లు ప్రోత్సాహం అందించాలి

- **పరిశ్రమల స్థాపనకు అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలి**
- **జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల, జూన్ 23 ఆంధ్ర మనం**



జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి మరింత ఊతమిచ్చే దిశగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో సహా చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకులు సానుకూలంగా వ్యవహరించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో పరిశ్రమల స్థాపన, సింగిల్ డెస్క్ విధానం అమలు, వివిధ రాయితీల మంజూరు, పరిశ్రమలకు సంబంధించిన సమస్యలు, కొత్త పారిశ్రామిక అవకాశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పరిశ్రమల స్థాపన లక్ష్యాల సాధనలో ఉన్న లోపాలను గుర్తించేందుకు సమగ్రంగా పరిశీలన (గ్యాప్ అనాలిసిస్) చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గతంలో నిర్దేశించిన లక్ష్యాలు పూర్తిగా ఎందుకు సాధ్యం కాలేదో పరిశీలించి, ప్రజల్లో అవగాహన లేకపోవడమా లేదా బ్యాంకులు, ఆర్థిక సంస్థల సహకారం తక్కువగా ఉండటమా అనే కారణాలను గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రస్తుతం ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పలు ప్రాజెక్టులు సిద్ధంగా ఉన్నప్పటికీ, రుణాల మంజూరులో జాప్యం, సిబిల్ స్కోర్ వంటి అంశాలు అవరోధాలుగా మారుతున్నాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. లోన్ మంజూరు ప్రక్రియను వేగవంతం చేసి, సాధ్యమైనంత వరకు అర్హులైన పారిశ్రామికవేత్తలకు బ్యాంకులు ప్రోత్సాహకరంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. సింగిల్ డెస్క్ విధానం క్రింద జిల్లాలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతుల కోసం మొత్తం 27 దరఖాస్తులు అందగా, వాటిలో 20 దరఖాస్తులకు సంబంధిత శాఖల ద్వారా అనుమతులు మంజూరైనట్లు కలెక్టర్ తెలిపారు. మిగిలిన ఏడు దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, వాటిపై నిర్ణీత గడువులోగా చర్యలు పూర్తి చేసి పారిశ్రామికవేత్తలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిశ్రమల ప్రోత్సాహానికి ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి రాయితీ, పావలా వడ్డీ, విద్యుత్ సబ్సిడీ, పన్ను రాయితీలు తదితర పథకాల కింద జిల్లాలోని ఉత్పాదక మరియు సేవారంగాలకు చెందిన 21 యూనిట్లకు రూ.5.88 కోట్లకు పైగా విలువైన రాయితీ ప్రయోజనాల మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది. జిల్లాలో మరిన్ని పరిశ్రమలు స్థాపించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ ఎస్. మహబూబ్ బాషా, నాబార్డు డీడీఎం కార్తీకేయ, ఎల్డీఎం అయ్యప్పరెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కిశోర్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్ర మనం

బుధవారం జూన్ 24 2026

# జ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాల మంజూరు

## 37 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వ ఆమోదం

**ఎచ్చెర్ల,నిమ్మాడ, జూన్ 23, ఆంధ్ర మనం:**



ఎచ్చెర్ల నియోజకవర్గంలోని వెనుకబడిన తరగతుల బాలికలకు నాణ్యమైన గురుకుల విద్య అందించాలనే సంకల్పంతో రాష్ట్ర వ్యవసాయ, సహకార, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేసిన నిరంతర కృషి ఫలించింది. మంత్రి ప్రత్యేక చొరవతో ఎచ్చెర్లకు మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, మధ్య తరగతి కుటుంబాల బాలికలకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో మంత్రి అచ్చెన్నాయుడు పలుమార్లు ప్రభుత్వ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో గురుకుల విద్యాసంస్థ అవసరాన్ని సమగ్రంగా వివరించి ప్రభుత్వం నుంచి అనుమతులు సాధించడంలో కీలక పాత్ర పోషించారు. నూతనంగా మంజూరైన ఈ గురుకుల బాలికల పాఠశాల నిర్వహణ కోసం వివిధ విభాగాల్లో మొత్తం 37 పోస్టుల భర్తీకి కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో విద్యార్థినులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన వసతి, శిక్షణా సౌకర్యాలు అందనున్నాయి. ఎచ్చెర్లకు గురుకుల పాఠశాల మంజూరు కావడం నియోజకవర్గ విద్యా రంగ అభివృద్ధిలో ఒక మైలురాయిగా స్థానిక ప్రజలు అభివర్ణిస్తున్నారు. ముఖ్యంగా బీసీ బాలికలకు ఉచితంగా నాణ్యమైన విద్య అందించే అవకాశం కల్పించిన మంత్రి అచ్చెన్నాయుడు కృషిని ప్రజలు, బీసీ సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కూడా మంత్రి అచ్చెన్నాయుడు చేసిన కృషిని కొనియాడుతూ, ఎచ్చెర్ల విద్యాభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరింత మంది పేద విద్యార్థినులు గురుకుల విద్య ద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకునే అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ కార్యదర్శిగా బెండి వూరు ముద్దుబిడ్డ

## డాక్టర్ హనుమంతు పురుషోత్తం బాధ్యతల స్వీకరణ పట్ల జిల్లా వాసుల హర్షం

**శ్రీకాకుళం/ అమరావతి, జూన్ 23, ఆంధ్ర మనం : <**

ఆంధ్రప్రదేశ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ శాఖ నూతన కార్యదర్శిగా శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బెండి గ్రామానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త, విద్యావేత్త డాక్టర్ హనుమంతు పురుషోత్తం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇంచార్జి హోదాలో ఉన్న ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. గతంలో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని 'నేషనల్ రీసెర్చ్ డెవలప్మెంట్ కార్పొరేషన్' చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గా పనిచేసి, "ఉత్తమ సీఈవో 2019" అవార్డు అందుకున్న పురుషోత్తం.. ఐఐటీ ఖరగ్‌పూర్, ఉస్మానియా వర్సిటీల పూర్వ విద్యార్థి కావడం గమనార్హం. శాస్త్ర, సాంకేతిక మరియు ఐపీఆర్ (ఇంటిలెక్టువల్ ప్రాపర్టీ రైట్స్ – మేధో సంపత్తి హక్కులు) రంగాల్లో దాదాపు నాలుగు దశాబ్దాల అపార అనుభవం ఉన్న పురుషోత్తం నియామకంపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తన సుదీర్ఘ కెరీర్‌లో 600 ఐపీఆర్ హక్కుల రక్షణకు, 500 సాంకేతికతలను స్టార్టప్‌లు, పరిశ్రమలకు చేర్చడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యా, పరిశ్రమలు, వ్యవసాయ, ఆరోగ్య శాఖల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆవిష్కరణల (ఇన్నోవేషన్) రంగంలో అగ్రగామిగా



నిలిపేందుకు శ్రమిస్తానని స్పష్టం చేశారు. సొంత జిల్లాకు చెందిన శాస్త్రవేత్త రాష్ట్ర స్థాయి కీలక పదవిని చేపట్టడం పట్ల జిల్లా అధికారులు, స్థానిక ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు.

# ఐఐఐటీ శ్రీకాకుళంలో అడ్మిషన్ల సందడి

## తొలిరోజు 500 మందికి కౌన్సిలింగ్ పూర్తి

**ఎచ్చెర్ల, జూన్ 23, ఆంధ్ర మనం:**

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ఐఐటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో ఆరేళ్ల సమీకృత బీటెక్ కోర్సు ప్రవేశాల కౌన్సిలింగ్ మంగళవారం ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ఎంపికైన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల రాకతో క్యాంపస్ ప్రాంగణం సందడిగా మారింది. కౌన్సిలింగ్‌కు వచ్చేవారి కోసం అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు ముందుగా టోకెన్లు కేటాయించి లోపలికి అనుమతించారు. అనంతరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్, కుల ధృవీకరణ పత్రాల పరిశీలన, ఆన్‌లైన్‌లో ఫీజుల




చెల్లింపు ప్రక్రియలను పూర్తి చేసి అడ్మిషన్లు కల్పించారు. శ్రీకాకుళం క్యాంపస్‌లో మొదటి ప్రవేశాన్ని పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ, కాశిపట్నానికి చెందిన వి. ప్రీతి దక్కించుకోగా, అనకాపల్లి జిల్లాకు చెందిన సి.హెచ్. దీక్షిత్ ధర్మతేజ రెండో అడ్మిషన్ పొందారు. వీరికి వర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ గిరిధర్ మద్రాసు చేతుల మీదుగా అడ్మిషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అడ్మిషన్ల కన్వీనర్, రిజిస్ట్రార్ ఆచార్య అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ శ్రీకాకుళం క్యాంపస్ సీట్లకు గానూ రెండు రోజుల పాటు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలిరోజు 500 మందికి కౌన్సిలింగ్ పూర్తి చేశామని, బుధవారం మరో 500 మందికి నిర్వహించడంతో ఈ ప్రక్రియ ముగుస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ పరిపాలనా అధికారి డా. ముని రామకృష్ణ, డీన్ డా. శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డా. వాసు, వెల్ఫేర్ డీన్లు ప్రకాశరావు, యోగేశ్వరి, వివిధ విభాగాల కో–ఆర్డినేటర్లు, సిబ్బంది, విద్యార్థి వాలంటీర్లు పాల్గొన్నారు.

# పరవాడ ఇండస్ట్రియల్ పార్క్ దక్షిణ్ ఎనర్జీ బాధితులకు అన్ని విధాల న్యాయం చేస్తాం

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యేపంచకర్ల రమేష్ బాబు.

**విశాఖపట్నం, జూన్ 23, ఆంధ్ర మనం..**

అనకాపల్లి జిల్లా పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని పరవాడ ఇండస్ట్రియల్ పార్క్ దక్షిణ ఎనర్జీ కెమికల్ కంపెనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. పలువురికి తీవ్ర గాయాలు అయ్యాయని సమాచారం. గాయాల పాలైన వారిని పలు ఆసుపత్రులకు చికిత్స కోసం తరలించారు. మృతుల కుటుంబాలను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పరామర్శించారు. మృత్యువాత పడిన ఇద్దరు కార్మికుల కుటుంబ సభ్యులను పరవాడ ఫార్మాసిటీలోనూ, విశాఖ కేజీహెచ్ వద్ద జనసేన విశాఖ ఉమ్మడి రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు పరామర్శించారు. అధికారులు, కంపెనీ ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులతో చర్చించి ఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రభుత్వపరంగాను, అటు కంపెనీ యాజమాన్యం నుండి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ఘటనలో యాజమాన్యం నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని బాధితులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా పరవాడ ఫార్మాసిటీ వద్ద, అనంతరం విశాఖ నగరంలో కేజీహెచ్ వద్ద ఎమ్మెల్యే రమేష్ బాబు మీడియాతో మాట్లాడుతూ ఫార్మా సిటీలో ఇలాంటి దురదృష్ట ఘటనలు తరచూ జరగడం అత్యంత ఆవేదన కలిగిస్తోందని, ఇలాంటివి పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఇలాంటి ఘటనలు జరగడం ఆందోళన కలిగిస్తుందోన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికార యంత్రానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇంకా ప్రమాదాలు జరుగుతుండటం విచారకరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాలుష్య నివారణ, పరిశ్రమల్లో ప్రమాదాల అరికట్టడంపై ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉందని స్పష్టం చేశారు. ఈ ఘటనపై మరింత లోతుగా దర్యాప్తు చేపట్టి ప్రమాదానికి గల కారణాలపై జిల్లా కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు చేపడతారని వివరించారు. కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏదేమైనా ఘటన జరిగిన వెంటనే ఆ కంపెనీ యాజమాన్యం ప్రతినిధులు చర్యలు చేపట్టాల్సి ఉందని, అలాకాకుండా వారు పరారు కావడం సరైనది కాదని పేర్కొన్నారు. దీనిపై కంపెనీ యాజమాన్యాన్ని ప్రశ్నించగా, భయపడి వేరేచోటకు వెళ్ళినట్లు వారు చెప్పారని ఎమ్మెల్యే వివరించారు. ఈ ప్రమాదంలో చోడవరం సమీపంలోని



గోవాడ గ్రామానికి చెందిన 34 ఏళ్ల వేపాడ వెంకటేష్ దుర్మరణం చెందగా, అతనికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారని వారంతా అనాథలు అయ్యారని ఆవేదన వెలిబుచ్చారు. అచ్యుతాపురం మండలం జగ్గన్న పేటకు చెందిన 24 ఏళ్ల బోడెపు త్రినాథ్ అసువులు బాయడంతో అతని కుటుంబం రోడ్డున పడిందని వాపోయారు. మృతి చెందిన వెంకటేష్, త్రినాధులను తీసుకురాలేకపోయినా ఆ కుటుంబాలకు మంచి ఆర్థిక తోడ్పాటు అందించి ఆదుకుంటామని ఎమ్మెల్యే రమేష్ బాబు హామీ ఇచ్చారు. ఫార్మాసిటీలలో కంపెనీ యాజమాన్యాలు కార్మికుల రక్షణ కోసం పటిష్ట చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ బాబు సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో పట్టుబడిన టన్నుకు పైగా గంజాయి భస్మీకరణ

## అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన వారోత్సవాల్లో భాగంగా చర్యలు

**విజయవాడ జూన్ 23 (ఆంధ్ర మనం )**

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని వివిధ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఎన్ డి పి ఎస్ చట్టం కింద నమోదైన కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను మంగళవారం పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడు గ్రామంలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంట్ పరిశ్రమలో శాస్త్రీయ పద్ధతిలో భస్మీకరించారు.ఎన్టీఆర్ జిల్లాకు చెందిన కేసుల్లో 363.549 కిలోల గంజాయి, 20 గ్రాముల ఎండీఎంఏ ( ఎండిఎంఏ ), 68.600 కిలోల ఇతర ఎన్ డి పి ఎస్ సంబంధిత పదార్థాలను అగ్నికి ఆహుతి చేశారు. అలాగే



కృష్ణా జిల్లాకు చెందిన 910.905 కిలోల గంజాయిని కూడా ఇదే విధంగా భస్మీకరించారు.డ్రగ్ డిస్పోజల్ కమిటీ (డీడీసీ) చైర్మన్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కమిటీ సభ్యులైన విజయవాడ, గుంటూరు అసిస్టెంట్ కమిషనర్లు సీహెచ్. లావణ్య, రవికుమార్, కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి నజీనా బేగం, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల ఎక్సైజ్ సీఐలు, సిబ్బంది, జిందాల్ ప్లాంట్ ప్రాజెక్ట్ ప్రెసిడెంట్ ఎం.వి. చారి పాల్గొన్నారు.అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన వారోత్సవాల సందర్భంగా యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అధికారులు పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇటువంటి చర్యలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

# దక్షిణ ఎనర్జీ కంపెనీలో పెను ప్రమాదం

## ఇద్దరు మృతి, పలువురికి తీవ్ర గాయాలు.

**పరవాడ, జూన్ 23 ఆంధ్ర మనం..**



పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలం ఇండస్ట్రియల్ పార్క్ లోని దక్షిణ ఎనర్జీ కంపెనీలో మంగళవారం ఉదయం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మంటల్లో చిక్కుకొని కాలిపోయారు. మరికొందరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని విశాఖ నగరంలోని కేజీహెచ్ కు తరలించారు. ఫార్మా సిటీలోని రెండు అగ్నిమాపక శకటాలు, పరవాడలోని మరో అగ్నిమాపక శకటం ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు చర్యలు చేపట్టాయి. ఈ ప్రమాదంలో చోడవరం సమీపంలోని గోవాడ గ్రామానికి చెందిన 34 ఏళ్ల వేపాడ వెంకటేష్ దుర్మరణం చెందగా, అతనికి ముగ్గురు కుమార్తెలు. వారంతా అనాధలు అయ్యారని గ్రామస్తులు ఆవేదన వెలిబుచ్చారు. అచ్యుతాపురం మండలం జగ్గన్న పేటకు చెందిన బోడెపు త్రినాథ్(24) మృత్యువు పాలయ్యాడు. బాధితుల కుటుంబాల రోదనలతో ప్రమాద స్థలం కన్నీటి సంద్రంగా మారింది. ప్రమాదంలో గాయాల పాలైన వారి వివరాలు ఇంకా తెలియవలసి ఉంది. అనకాపల్లి జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రమాద స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

# రజకులకు గ్యాస్ తో వినియోగించే ఐరన్ (ఇస్త్రీ) బాక్సులు పంపిణీ చేసిన

## రోటరీ క్లబ్ ఆఫ్ లైమ్ సిటీ

**పిడుగురాళ్ల : జూన్ 23 ఆంధ్ర మనం**




పిడుగురాళ్ల పట్టణంలోనే రజకులకు బట్టలు ఇస్త్రీ చేస్తూ జీవన ఉపాధి సాగిస్తున్న వారి కుటుంబం అభివృద్ధి కొరకు రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో షాక్ కంపెనీ వారి ఆర్థిక ప్రోత్సాహంతో రోటరీ క్లబ్ ఆఫ్ లైన్ సిటీ పిడుగురాళ్ల వారి సహాయంతో రజకులకు జీవన ఉపాధి, కలుషితం లేని స్వచ్ఛందనం వాడకం కొరకు 100మంది రజకులకు ఐరన్ బాక్సులు అందజేయడం జరిగింది. ఐరన్ బాక్స్ లో అందుకున్న రజక సంఘం కులస్తులు సంతోషం వ్యక్తపరుస్తూ రోటరీ సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ ఎస్ వి రాంప్రసాద్ గవర్నర్ (3150) వి బాలకోటి రెడ్డి డైరెక్టర్ బి జి ఆర్ మైనింగ్ అండ్ ఇన్ఫ్రా లిమిటెడ్ వారు హాజరై ఐరన్ బాక్స్ లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పి కళ్యాణ్ ప్రెసిడెంట్ ఆర్ సి జూబ్లీహిల్స్, డాక్టర్ పి విష్ణు బాబు ప్రాజెక్ట్ చైర్మన్, జుజ్జూరు మురళి అసిస్టెంట్ గవర్నర్, ఈ కార్యక్రమానికి కన్వీనర్లుగా వ్యవహరించిన గంధం హరికృష్ణ , గర్రె సుబ్రహ్మణ్యం. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రోటరీ క్లబ్ ఆఫ్ లైన్ సిటీ అధ్యక్షులు కోటా రమేష్ , సెక్రటరీ పచ్చిపులుసు పాపయ్య గుప్తా, ట్రెజరీ ఊటుకూరు గురునాథం పాల్గొన్నారు.

# శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకున్న కేంద్ర, మంత్రి తోఖాన్ సాహు, నారాయణ

**విజయవాడ ఇంద్రకీలాద్రి జూన్ 23 ( ఆంధ్ర మనం)**



ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్లను కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖాన్ సాహు, రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ మంగళవారం దర్శించుకున్నారు.ఆలయానికి చేరుకున్న మంత్రులకు దుర్గగుడి ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), డిప్యూటీ ఈవో కిషోర్‌కుమార్, ఏఈవో సీసీ రెడ్డి తదితరులు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేద పండితులు ఆశీర్వచనం అందించగా, దేవస్థానం అధికారులు అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు, జ్ఞాపికలను సమర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తోఖాన్ సాహు మాట్లాడుతూ కనకదుర్గమ్మ దర్శనం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. దేశ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# పాఠశాల విద్యార్థులకు వ్యాయామశాల ఏర్పాటు చేసిన

## రోటరీ క్లబ్ ఆఫ్ లైన్ సిటీ

**పిడుగురాళ్ల : జూన్ 23 ఆంధ్ర మనం**



పిడుగురాళ్ల పట్టణలో మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పాఠశాల ప్రాంగణం ( పాఠశాల గ్రౌండ్ లో ) వ్యాయామశాల ఏర్పాటు చేసిన రోటరీ క్లబ్ ఆఫ్ లైన్ సిటీ. ముఖ్యఅతిథిగా వీచ్చేసిన రోటరీ క్లబ్ గవర్నర్( 3150), డాక్టర్ ఎస్ వి రాంప్రసాద్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవంచేసి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కొత్త మల్లికార్జునరావు సమక్షంలో విద్యార్థినీ విద్యార్థులకు వ్యాయామ శాలను అంకితం చేశారు. అనంతరం ప్రతి విద్యార్థికి తమ తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటాలని మొక్కలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న పి కళ్యాణ్ ప్రెసిడెంట్ ఆర్ సి జూబ్లీహిల్స్, డాక్టర్ పి విష్ణు బాబు ప్రాజెక్టు చైర్మన్, జజ్జూరు మురళి అసిస్టెంట్ గవర్నర్, ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యులు పిడుగురాళ్ల రోటరీ క్లబ్ ఆఫ్ లైమ్ సిటీ అధ్యక్షులు కోటా రమేష్ , సెక్రెటరీ, పచ్చి పులుసు పాపయ్య గుప్తా, ట్రెజరర్ ఊటుకూరి గురునాథం పాల్గొన్నారు. రోటరీ క్లబ్ లైమ్ సిటీ అధ్యక్ష, కార్యదర్శి, ట్రెజరర్, రోటరీ క్లబ్ సభ్యులకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆంధ్ర మనం

బుధవారం జూన్ 24 2026

# సంస్థాగత బలోపేతమే లక్ష్యం

## ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: గద్దె అనురాధ

**విజయవాడ తూర్పు జూన్ 23 (ఆంధ్ర మనం)**



సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ అన్నారు. విజయవాడ ఆటోనగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆమె అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు.గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల నుంచి వచ్చే సమస్యలను జిల్లా స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం ద్వారా గత రెండేళ్లలో ప్రభుత్వం, పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమంలో భాగంగా బీఎల్ఏలు, బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని, ఓటర్ల నమోదులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి అర్హుడి ఓటు నమోదు అయ్యేలా చూడటంతో పాటు మరణించిన వారి పేర్ల తొలగింపును జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, రాబోయే నెలల్లో పార్టీ చేపట్టనున్న కార్యక్రమాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పనితీరును వివరించడంతో పాటు ప్రజల సమస్యలను నమోదు చేయాలని సూచించారు. టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ మంతెన వెంకట సత్యనారాయణ రాజు మాట్లాడుతూ, కార్యక్రమాల పర్యవేక్షణ కోసం క్లస్టర్ల వారీగా సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ప్రతి నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యేలు శ్రీరామ్ రాజగోపాల్, గద్దె రామమోహన్, కార్పొరేషన్ చైర్మన్లు కసునూరి నాగుల్ మీరా, గొట్టుముక్కల రఘురామరాజు, శావల దేవదత్, ఎరుబోతు రమణారావు, ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.ఎస్. బేగ్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు ధరణికోట విజయలక్ష్మి , తాళ్లూరు రామారావు, చలసాని రమణారావు తదితరులు పాల్గొన్నారు.

# తూర్పు నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలపై సమాధానం చెప్పాలి

## గద్దె రామ్మోహన్ ఆరోపణలు అవాస్తవాలు: దేవినేని అవినాష్

**విజయవాడ జూన్ 23 (ఆంధ్ర మనం)**




( విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తనపై, వైఎస్సార్‌సీపీపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవాలని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ కార్యాలయంపై దాడి అంశాన్ని నేటికీ ప్రస్తావిస్తున్నారని, ఆ ఆరోపణలు నిజమైతే తనకు శిక్ష పడేదని పేర్కొన్నారు. అధికారంలో ఉన్న టీడీపీ నాయకులు దమ్ముంటే ఆరోపణలను నిరూపించాలని సవాల్ విసిరారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల విషయంలో తమ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులను ధైర్యంగా చెప్పగలమన్నారు.తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అనేక కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేశారని ఆరోపించారు. సాక్షి కార్యాలయంపై దాడి, వైఎస్సార్‌సీపీ బీసీ నాయకుడు పవన్‌పై దాడి వంటి ఘటనలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై కూడా చర్యలు తీసుకున్నారని విమర్శించారు. చిరు వ్యాపారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పంపిణీ చేసిన కూరగాయల బండ్లు, ఇతర ఉపాధి వనరులను టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలగించిందన్నారు. దేవినేని నెహ్రూ విగ్రహం ధ్వంసం ఘటనపై కూడా స్పందించాలని కోరారు.తూర్పు నియోజకవర్గంలో గత రెండేళ్లుగా అవినీతి, అక్రమాలు పెరిగాయని ఆరోపించిన అవినాష్, స్పా సెంటర్లు, కాంట్రాక్టులు, రేషన్ వ్యవహారాలు, అక్రమ నిర్మాణాలు తదితర అంశాల్లో అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు. రిటైనింగ్ వాల్లు, రహదారులు, పార్కులు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల అభివృద్ధి పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని పేర్కొన్నారు.గద్దె రామ్మోహన్‌కు చెప్పుకోదగ్గ అభివృద్ధి కార్యక్రమాలు లేవని విమర్శించిన ఆయన, ప్రజా సమస్యలపై వైఎస్సార్‌సీపీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు.

# ఓటు హక్కుల పరిరక్షణకు వైసీపీ కట్టుబడి ఉంది

## అర్హుల ఓట్లు తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వెలంపల్లి ఆరోపణ

**విజయవాడ, జూన్ 23 (ఆంధ్ర మనం)**



ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడే బాధ్యతను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 38, 39వ డివిజన్లలో పర్యటించి పలు పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లను కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లకుండా, అర్హులెవరూ నష్టపోకుండా ఉండేందుకు పార్టీ తరపున క్షేత్రస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. గత ఎన్నికల ఓటర్ల వివరాలను సేకరించి ప్రజలకు అవసరమైన సమాచారం అందిస్తున్నట్లు చెప్పారు.రాష్ట్రంలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించిన ఆయన, బూత్ లెవల్ అధికారులు అవగాహన లోపంతో పనిచేస్తున్నారని విమర్శించారు. దీంతో అనేక మంది అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.ప్రభుత్వ అధికారులపై ఉన్న పనిభారం, పైస్థాయి నుంచి వస్తున్న ఒత్తిళ్ల కారణంగా బీఎల్‌వోలు ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించలేకపోతున్నారని పేర్కొన్నారు. యోగా దినోత్సవం వంటి కార్యక్రమాల కారణంగా కూడా సర్వే ప్రక్రియ మందగించిందని అన్నారు. ఇకనైనా బీఎల్‌వోలకు ఇతర పనులు అప్పగించకుండా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై పూర్తిస్థాయిలో దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.ప్రతి ఓటరు తమ పేరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, ఓటు హక్కుల పరిరక్షణ కోసం వైసీపీ శ్రేణులు ప్రజలకు అండగా ఉంటాయని వెలంపల్లి భరోసా ఇచ్చారు.

# ఉద్యోగులకు మేలు చేసిన నిర్ణయాలు.. సీఎంకు సంఘాల కృతజ్ఞతలు

**అమరావతి, జూన్ 23 (ఆంధ్ర మనం)**



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రయోజనం చేకూరేలా కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలపై వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీల్లో ఉద్యోగ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచడం, 2004 సెప్టెంబరు కంటే ముందు నోటిఫికేషన్ల ఆధారంగా నియామకమైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కేబినెట్ నిర్ణయించడాన్ని వారు స్వాగతించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పలు కీలక నిర్ణయాలు తీసుకోవడంతో ఉద్యోగుల్లో విశ్వాసం పెరిగిందని సంఘాల నేతలు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభించడం వల్ల ఉద్యోగులతో పాటు వారి కుటుంబాలకు కూడా ప్రయోజనం చేకూరుతోందని తెలిపారు. రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ఎప్పటికీ మరువలేమని వారు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజా సంక్షేమం దృష్ట్యా ఉద్యోగులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఉద్యోగ సంఘాలన్నీ సమన్వయంతో రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. డీఎస్సీ–2003 ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసి ధన్యవాదాలు తెలిపారు.

# ఏపీఎల్ తుది పోరుకు మంగళగిరి ముస్తాబు

## నేడు రామ్ చరణ్ రాక.సంగీతంతో అలరించనున్న తమన్

## ఫైనల్ కు ముఖ్య అతిథిగా నారా లోకేష్

**మంగళగిరి, జూన్ 23 (ఆంధ్ర మనం)**

ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) తుది దశ పోటీలకు మంగళగిరి ఏసీఏ స్టేడియం సర్వాంగసుందరంగా సిద్ధమైంది. ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లు ఇక్కడ నిర్వహించనున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అధ్యక్షుడు కేశినేని శివనాథ్ తెలిపారు. నేటి ప్రారంభ కార్యక్రమానికి సినీ నటుడు రామ్‌చరణ్ ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ ప్రత్యేక సంగీత ప్రదర్శనతో ప్రేక్షకులను అలరించనున్నారు. జూన్ 9న విశాఖపట్నంలో ప్రారంభమైన ఏపీఎల్ విజయవంతంగా కొనసాగుతోందని, అనంతరం కడపలో నిర్వహించిన మ్యాచ్‌లకు కూడా విశేష స్పందన లభించిందని ఆయన తెలిపారు. తుది దశ పోటీల కోసం మంగళగిరిలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని, ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైతే ఫైనల్‌కు రిజర్వ్ డే కూడా కేటాయించినట్లు వెల్లడించారు. మంగళగిరి స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసినట్లు శివనాథ్ తెలిపారు. ఆటగాళ్ల డ్రెస్సింగ్ రూములు, డైనింగ్ హాల్స్, మ్యాచ్ అధికారుల గదులు, ప్రసార కేంద్రాలు, కామెంట్రీ బాక్సులు, సూట్ రూములు, జిమ్, ఇండోర్ ప్రాక్టీస్ సెంటర్, ఆధునిక ఫ్లడ్‌లైట్స్‌తో పాటు సుమారు 75 గదులను సిద్ధం చేసినట్లు చెప్పారు. స్టేడియం సుందరీకరణ, కాంపౌండ్ వాల్, గేట్లు, ప్రేక్షకుల సౌకర్యాల కల్పన వంటి పనులను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 30న జరిగే ఫైనల్ మ్యాచ్‌కు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. బీసీసీఐ ప్రతినిధులు, రాష్ట్రంలోని జిల్లా క్రికెట్ సంఘాల ప్రతినిధులను కూడా ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు.



ఏపీఎల్ ద్వారా గ్రామీణ ప్రాంతాల యువ క్రికెటర్లకు ప్రతిభ చాటుకునే అవకాశం లభిస్తోందని, రాష్ట్రంలో క్రీడల అభివృద్ధే ఏసీఏ ప్రధాన లక్ష్యమని శివనాథ్ పేర్కొన్నారు. ప్రతి మ్యాచ్ రోజు ప్రేక్షకుల కోసం ప్రత్యేక సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఏపీఎల్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# చిన్ని మెగా హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన

- **400 మందికి పైగా ప్రజలకు ఉచిత వైద్య సేవలు ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు.గుండె వ్యాధుల గుర్తింపుకు ప్రత్యేక ఏర్పాట్లు**

**విజయవాడ తూర్పు జూన్ 23 (ఆంధ్ర మనం)**



ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన 'హెల్తీ–వెల్తీ–హ్యాపీ విజయవాడ' కార్యక్రమంలో భాగమైన ఈ శిబిరంలో 400 మందికి పైగా ప్రజలు పాల్గొని వైద్య సేవలు పొందారు.శిబిరాన్ని సానా సతీష్, ఎమ్మెల్సీ సత్యనారాయణ రాజు ప్రారంభించారు. ప్రముఖ గుండె వ్యాధుల నిపుణుడు డా. ఆకాష్ పల్లెం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో గుండె సంబంధిత వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం, ఛాతినొప్పి, గుండెదడ, ఆయాసం వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి నిపుణుల సలహాలు అందించారు.

శిబిరంలో భాగంగా ఉచిత ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. గుండె సంబంధిత సమస్యలు గుర్తించిన వారికి రూ.13 వేల విలువైన యాంజియోగ్రామ్ పరీక్షలను డా. ఎన్టీఆర్ వైద్య సేవా పథకం ద్వారా ఉచితంగా చేయించుకునే అవకాశాన్ని కల్పించారు.ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజమే అభివృద్ధికి పునాది అని పేర్కొంటూ, విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలకు నిపుణుల వైద్య సేవలను చేరువ చేసే కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని వెల్లడించారు.శిబిరానికి హాజరైన ప్రజలు ఆధునిక వైద్య పరీక్షలు, నిపుణుల సలహాలు ఉచితంగా అందించడంపై సంతోషం వ్యక్తం చేశారు. తమ ఆరోగ్య సమస్యలకు సరైన సూచనలు లభించాయని పేర్కొన్నారు. ప్రజారోగ్యాన్ని కేంద్రంగా చేసుకుని ఎంపీ కేశినేని చిన్ని చేపడుతున్న కార్యక్రమాలు ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందిస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.

# జనరిక్ మందులతో ప్రజలకు ఆరోగ్య భరోసా

- **తక్కువ ధరలో నాణ్యమైన ఔషధాలు అందుబాటులోకి వస్తున్నాయి**
- **జెనివిస్ రెమిడీస్ మోడల్ ఫ్రాంచైజీ ప్రారంభించిన ఎమ్మెల్యే బొండా ఉమా**

**విజయవాడ, జూన్ 23 (ఆంధ్ర మనం ):**



ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన మందులు అందించడంలో జనరిక్ మెడిసిన్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. నగరంలోని దుర్గా అగ్రహారం, ఏలూరు రోడ్డులోని ఎన్ఆర్‌హెచ్ జనరిక్ మెడిసిన్ స్టోర్‌లో జెనివిస్ రెమిడీస్ మోడల్ ఫ్రాంచైజీ, విజయవాడ రీజినల్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆలోచనలకు అనుగుణంగా ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన మందులు అందించేందుకు జనరిక్ మెడిసిన్స్‌ను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. జనరిక్, బ్రాండెడ్ మందుల మధ్య నాణ్యత పరంగా ఎలాంటి తేడా ఉండదని, అదే ప్రమాణాలతో తయారయ్యే జనరిక్ మందులు 80 నుంచి 90 శాతం వరకు తక్కువ ధరలో లభిస్తున్నాయని తెలిపారు.బీపీ, షుగర్, గుండె, కిడ్నీ తదితర దీర్ఘకాలిక వ్యాధులకు అవసరమైన మందులు కూడా జనరిక్ రూపంలో అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వాటి గురించి అవగాహన పెంచుకుని వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా జనరిక్ మెడిసిన్ స్టోర్ల విస్తరణ ద్వారా ఆరోగ్య సేవలను మరింత చేరువ చేస్తున్నట్లు పేర్కొన్నారు.మధ్యతరగతి, పేద వర్గాల ప్రజలకు నాణ్యమైన మందులు అందుబాటు ధరల్లో లభించేందుకు జనరిక్ మెడిసిన్స్ ఎంతో దోహదపడుతున్నాయని చెప్పారు. బ్రాండెడ్ మందుల పేరుతో అధిక ధరలు చెల్లించాల్సిన అవసరం లేకుండా జనరిక్ మందులు ఉత్తమ ప్రత్యామ్నాయంగా నిలుస్తున్నాయని తెలిపారు.అనంతరం జెనివిస్ రెమిడీస్ సంస్థ ప్రతినిధులను అభినందించిన బొండా ఉమా, సంస్థ సేవలను మరిన్ని ప్రాంతాలకు విస్తరించి ప్రజలకు ఉపయోగపడాలని ఆకాంక్షించారు.

# టూరిస్ట్ బస్సుల పన్ను తగ్గింపుకు క్యాబినెట్ ఆమోదం

- **ప్రతి సీటుపై త్రైమాసిక పన్ను రూ.4 వేల నుంచి రూ.2,500కు తగ్గింపు**
- **రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చొరవ ఫలితం**

**అమరావతి, జూన్ 23 (ఆంధ్ర మనం)**

ఆల్ ఇండియా టూరిస్ట్ పర్మిట్ (ఏఐటీపీ) కలిగిన టూరిస్ట్ బస్సులపై త్రైమాసిక పన్నును తగ్గించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం మంగళవారం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ప్రతి సీటుపై త్రైమాసికానికి రూ.4,000గా ఉన్న పన్నును రూ.2,500కు తగ్గించాలని నిర్ణయించింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చొరవతో ఈ ప్రతిపాదన క్యాబినెట్ ముందుకు వెళ్లి ఆమోదం పొందింది.ఈ నిర్ణయంతో టూరిస్ట్ బస్సు యజమానులకు గణనీయమైన ఆర్థిక భారం తగ్గనుందని అధికారులు భావిస్తున్నారు. అలాగే ఇతర రాష్ట్రాలకు మారిన టూరిస్ట్ వాహనాల రిజిస్ట్రేషన్లు తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే అవకాశం కూడా ఏర్పడనుంది. పర్యాటక రంగ అభివృద్ధికి, రవాణా రంగ ప్రోత్సాహానికి ఈ నిర్ణయం దోహదపడుతుందని ప్రభుత్వం పేర్కొంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. వాహన యజమానుల సంక్షేమం, రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో ప్రయోజనకరమని ఆయన అన్నారు. క్యాబినెట్ నిర్ణయం అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ బస్సు ఆపరేటర్ల అసోసియేషన్ ప్రతినిధులు అమరావతి సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో మంత్రి



మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కలిసి అభినందించారు. పన్ను తగ్గింపు నిర్ణయానికి కృతజ్ఞతలు తెలుపుతూ కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు గౌతమ్ కిరణ్, ఉపాధ్యక్షుడు కేవీఆర్ నాని, కార్యదర్శి రాంబాబు, కోశాధికారి సందీప్, జాయింట్ కోశాధికారి సువర్చలాదేవి తదితరులు పాల్గొన్నారు.



# విజయ్-త్రిషపై మళ్లీ ఊహాగానాలు

కోలీవుడ్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన తెరజంటల్లో దళపతి విజయ్, త్రిష జోడీకి ప్రత్యేక స్థానం ఉంది. పలు విజయవంతమైన చిత్రాల్లో కలిసి నటించిన ఈ ఇద్దరి మధ్య ఉన్న తెరపై కెమిస్ట్రీ ఎప్పుడూ అభిమానులను ఆకట్టుకుంది. అయితే గత కొంతకాలంగా వీరి వ్యక్తిగత అనుబంధంపై కూడా సామాజిక మాధ్యమాల్లో రకరకాల ప్రచారాలు సాగుతున్నాయి. తాజాగా విజయ్ పుట్టినరోజు సందర్భంగా త్రిష ఎలాంటి శుభాకాంక్షల సందేశం పెట్టకపోవడం మరోసారి చర్చనీయాంశంగా మారింది. దీంతో వీరిద్దరి మధ్య ఏమైనా దూరం పెరిగిందా అనే అనుమానాలు అభిమాన వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా విజయ్, త్రిషలు పలు కార్యక్రమాల్లో కలిసి కనిపించడం, ఒకరి సినిమాలకు మరొకరు మద్దతు ఇవ్వడం, వ్యక్తిగత వేడుకల్లో హాజరవడం వంటి పరిణామాలు అభిమానుల్లో ఆసక్తి పెంచాయి. ఈ క్రమంలో వీరిద్దరి స్నేహం కేవలం సహనటుల సంబంధాన్ని మించి ఉండొచ్చని సామాజిక మాధ్యమాల్లో ఎన్నో కథనాలు వెలువడ్డాయి. అదే సమయంలో విజయ్ వ్యక్తిగత జీవితంపై కూడా పలు ఊహాగానాలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ అంశాలపై విజయ్ గానీ, త్రిష గానీ ఎప్పుడూ బహిరంగంగా స్పందించలేదు. అధికారిక ప్రకటనలేమీ లేకపోయినా, వీరి గురించి వచ్చే ప్రతి చిన్న పరిణామం అభిమానుల్లో పెద్ద చర్చకు దారి తీస్తూనే ఉంది. ఈసారి విజయ్ పుట్టినరోజు సందర్భంగా సినీ ప్రముఖులు, అభిమానులు, రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు. సామాజిక మాధ్యమాలు విజయ్‌కు సంబంధించిన పోస్టులు, చిత్రాలు, వీడియోలతో నిండిపోయాయి. ఇలాంటి సమయంలో ప్రతి ఏడాది విజయ్‌కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు చెప్పే త్రిష ఈసారి పూర్తిగా మౌనం పాటించడం అందరి దృష్టిని ఆకర్షించింది. త్రిష సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటూ తరచూ తన చిత్రాల అప్‌డేట్లు, వ్యక్తిగత ఫొటోలు పంచుకుంటూ ఉంటారు. అలాంటి త్రిష విజయ్ పుట్టినరోజు వంటి సందర్భంలో స్పందించకపోవడంతో అభిమానుల్లో పలు రకాల వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. చెన్నై సినీ వర్గాల్లో వినిపిస్తున్న ప్రచారాల ప్రకారం విజయ్ ప్రస్తుతం తన కుటుంబ జీవితం, రాజకీయ బాధ్యతలపై మరింత దృష్టి పెట్టినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో త్రిష కూడా వ్యక్తిగత అంశాల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తూ కొంత దూరం పాటిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఇవన్నీ ఇప్పటివరకు కేవలం ప్రచారాలుగానే మిగిలాయి. విజయ్ లేదా త్రిష తరఫున ఎలాంటి స్పష్టత రాకపోవడంతో నిజానిజాలు తెలియని పరిస్థితి నెలకొంది. కొందరు అభిమానులు త్రిష ఈసారి శుభాకాంక్షలు చెప్పకపోవడాన్ని సాధారణ విషయంగానే తీసుకుంటుండగా, మరికొందరు మాత్రం దీనిని ఇద్దరి మధ్య సంబంధాల్లో మార్పుకు సంకేతంగా భావిస్తున్నారు. మొత్తానికి విజయ్-త్రిష పేర్లు మరోసారి సామాజిక మాధ్యమాల్లో చర్చకు రావడానికి ఈ ఒక్క విషయం చాలిపోయింది. అయితే సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలకు సంబంధించిన ప్రచారాల విషయంలో అధికారిక సమాచారం వచ్చే వరకు జాగ్రత్తగా వ్యవహరించడం అవసరమని సినీ వర్గాలు సూచిస్తున్నాయి. ప్రస్తుతం విజయ్ రాజకీయాల వైపు అడుగులు వేస్తూ కొత్త బాధ్యతల్లో నిమగ్నమై ఉండగా, త్రిష వరుస సినిమాలతో తన కెరీర్‌ను ముందుకు తీసుకెళు _న్నారు. ఇలాంటి సమయంలో వ్యక్తిగత ప్రచారాల కంటే వారి వృత్తి జీవితానికే ప్రాధాన్యం ఇవ్వాలన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

# 'మా ఇంటి బంగారం'

## బృందాన్ని అభినందించిన చిరంజీవి

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం విడుదలైన తర్వాత ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతోంది. జూన్ 19న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమాకు సానుకూల స్పందన రావడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా మంచి వసూళ్లు నమోదవుతున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. సమంత, రాజ్ నిడిమోరు దంపతులతో పాటు దర్శకురాలు నందిని రెడ్డి, యూనిట్ సభ్యులను తన నివాసానికి ఆహ్వానించిన ఆయన సినిమా విజయంపై శు భాకాంక్షలు తెలిపారు. సినిమా వీక్షించిన అనంతరం చిరంజీవి తన అభిప్రాయాన్ని వెల్లడిస్తూ 'మా ఇంటి బంగారం' ఎంతో ఆసక్తికరంగా అనిపించిందని పేర్కొన్నారు. ఉమ్మడి కుటుంబం నేపథ్యంగా యాక్షన్, భావోద్వేగాలను చక్కగా మేళవిస్తూ దర్శకురాలు నందిని రెడ్డి తనదైన శైలిలో చిత్రాన్ని వినోదాత్మకంగా మలిచారని ప్రశంసించారు. కుటుంబ బంధాలు, అనుబంధాలు, భావోద్వేగాలు కలిసిన కథను ఆకట్టుకునే రీతిలో తెరపై ఆవిష్కరించారని ఆయన అభినందించినట్లు సమాచారం. కథనం నడిపించిన తీరు, పాత్రల మలుపులు, వినోదాన్ని జోడించిన విధానం చిత్రానికి ప్రధాన బలంగా నిలిచాయని చిరంజీవి అభిప్రాయపడ్డారని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. సమంత నటనపై కూడా చిరంజీవి ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా చీరకట్టులో ఆమె చేసిన యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని, భావోద్వేగ దృశ్యాల్లోనూ సమంత తన పాత్రకు పూర్తి న్యాయం చేశారని కొనియాడినట్లు సమాచారం. మహిళా ప్రాధాన్య చిత్రాలు తెలుగు సినీ పరిశ్రమకు అవసరమని, అలాంటి కథలకు ప్రేక్షకులు కూడా ఆదరణ చూపుతున్నారని ఆయన



అభిప్రాయపడ్డారని చెబుతున్నారు. ఈ విజయానికి సమంత, నందిని రెడ్డి, రాజ్ నిడిమోరు సహా మొత్తం చిత్ర బృందం అభినందనలకు అర్హులని చిరంజీవి పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఇక సమంత వ్యక్తిగత జీవితంపై కూడా చిరంజీవి చేసిన ఒక వ్యాఖ్య ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారి తీసింది. జీవితంలో కొత్త అధ్యాయాన్ని ఆహ్వానిస్తున్న సమంత, రాజ్ దంపతులకు ప్రత్యేక అభినందనలు అని ఆయన చెప్పిన మాటలను కొందరు అభిమానులు వేర్వేరు రీతుల్లో అర్థం చేసుకుంటున్నారు. అయితే ఆ వ్యాఖ్యకు సంబంధించి ఎలాంటి అధికారిక స్పష్టత లేకపోవడంతో సామాజిక మాధ్యమాల్లో ఊహాగానాలు మొదలయ్యాయి. సమంత గర్భధారణ గురించి చిరంజీవి పరోక్షంగా సంకేతం ఇచ్చారా అనే చర్చ కూడా కొన్ని వర్గాల్లో కనిపిస్తోంది. అయితే దీనిపై సమంత, రాజ్ నిడిమోరు లేదా చిరంజీవి తరఫున ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అందువల్ల ఈ తరహా ప్రచారాలను జాగ్రత్తగా మాత్రమే చూడాల్సిన అవసరం ఉంది. మొత్తంగా చూస్తే 'మా ఇంటి బంగారం'కు లభిస్తున్న ఆదరణ, సమంత నటనకు వస్తున్న ప్రశంసలు, ఇప్పుడు చిరంజీవి అభినందనలు కలిసి ఈ చిత్రానికి మరింత ప్రచారం తీసుకొచ్చాయి. మొదటి రోజునుంచే కుటుంబ నేపథ్యం, భావోద్వేగ సన్నివేశాలు, యాక్షన్ మేళవింపుతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సినిమా, సమంత కెరీర్‌లో మరో గుర్తుండిపోయే చిత్రంగా నిలుస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కించిన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణతో పాటు పరిశ్రమ ప్రముఖుల ప్రశంసలు కూడా బలాన్నిస్తున్నాయి.

# బాహుబలి: ది ఎటర్నల్ వార్

## కీలక అప్‌డేట్‌ను అందించిన ప్రభాస్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులకు మరో సర్‌ప్రైజ్ అందించారు. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న కొత్త యానిమేషన్ ప్రాజెక్ట్ 'బాహుబలి: ది ఎటర్నల్ వార్'కు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను ప్రభాస్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ అభిమానుల్లో భారీ ఆసక్తిని పెంచారు. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. యానిమేషన్ రూపంలో ప్రభాస్ యోధుడి అవతారంలో కనిపించడం అభిమానులకు గూస్‌బంప్స్ కలిగిస్తోంది. 'బాహుబలి' ప్రపంచాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్న ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ప్రపంచంలోని అత్యంత ప్రతిష్టాత్మక యానిమేషన్ ఉత్సవాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఫ్రాన్స్‌లోని 'అన్నెసీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026'లో 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' ఎంపిక కావడం భారతీయ సినీ పరిశ్రమకు గర్వకారణంగా మారింది. ఈ ఫెస్టివల్‌లో నిర్వహించే 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' సెషన్‌లో ఈ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా యానిమేషన్ రంగానికి చెందిన ప్రముఖులు, స్టూడియోలు, నిర్మాతలు, దర్శకుల సమక్షంలో ఈ ప్రాజెక్ట్ ప్రదర్శించబడనుండటం విశేషం. ప్రభాస్ ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకుంటూ తన ఆనందాన్ని అభిమానులతో పంచుకున్నారు. ఆయన చేసిన పోస్ట్ కొద్ది నిమిషాల్లోనే లక్షలాది లైక్స్, వేలాది కామెంట్లను సొంతం చేసుకుంది. ఈ యానిమేషన్ చిత్రాన్ని ఆర్కా మీడియా వర్క్స్ నిర్మిస్తోంది. 'బాహుబలి' ఫ్రాంచైజీని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ఈ ప్రాజెక్ట్‌కు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రముఖ యానిమేషన్ దర్శకుడు ఇషాన్ శుక్లా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రభాస్ తన పోస్ట్‌లో .. బాహుబలి: ది ఎటర్నల్ వార్ ప్రాజెక్ట్ అన్నెసీ యానిమేషన్ ఫెస్టివల్‌కు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. మా టీమ్ నిజంగా అద్భుతమైన పనిని చేస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రపంచం ఎప్పుడెప్పుడు చూస్తుందా అని నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని పేర్కొన్నారు.





# రామ్ సినిమాలో నివేదా?

టాలీవుడ్‌లో తనదైన నటనతో పాటు గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి నివేదా పేతురాజ్ మరో క్రేజీ అవకాశాన్ని దక్కించుకున్నట్లు సమాచారం. 'మెంటల్ మదిలో' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ఈ నటి, ఆ తర్వాత విభిన్న పాత్రలతో ప్రేక్షకుల మనసు గెలుచుకుంది. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న రాబోయే కొత్త చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికైనట్లు ఫిల్మ్ నగర్‌లో గట్టిగా ప్రచారం జరుగుతోంది. నివేదా పేతురాజ్ ఇప్పటికే తెలుగులో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించారు. 'చిత్రలహరి', 'బ్రోచేవారెవరురా', 'అల వైకుంఠపురములో' వంటి చిత్రాల్లో ఆమె నటనకు మంచి స్పందన లభించింది. అలాగే 'బ్లడీ మేరీ' వంటి ఓటీటీ చిత్రం, 'విరాట పర్వం', 'దాస్ కా ధమ్కీ' వంటి చిత్రాల్లో కూడా విభిన్నమైన పాత్రల్లో నటించి తన ప్రతిభను నిరూపించుకున్నారు. ఇటీవల వచ్చిన 'సింగ్ గీతం' చిత్రంతో కూడా ఆమె ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఇప్పుడు రామ్ పోతినేని సరసన నటించే అవకాశం లభిస్తే ఇది ఆమె కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా మారుతుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. రామ్ పోతినేని ఎనర్జీకి తగ్గట్టుగా కథానాయిక పాత్రను కూడా దర్శకుడు బలంగా రూపకల్పన చేసినట్లు సమాచారం. ఈ చిత్రంలో నివేదా పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని టాక్ వినిపిస్తోంది. ఈ క్రేజీ కాంబినేషన్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో కూడా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# ఆదర్శకుటుంబం ఆలస్యం అవుతోందా ?




విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న క్రేజీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47. సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ సినిమాను అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా విడుదల చేయ-ంబోతున్నట్లు ఇటీవల వార్తలు వినిపించాయి. కానీ పరిస్థితులు చూస్తుంటే అందుకు అనుగుణంగా లేవు అనే టాక్ వినిపిస్తోంది. ఫిల్మ్ నగర్ వర్గాల్లో ఈ సినిమా విడుదలపై ఒక షాకింగ్ గాసిప్ గట్టిగా వినిపిస్తోంది. ఈ మోస్ట్ అవేటెడ్ మూవీ అనుకున్న సమయానికి రావడం లేదని వాయిదా పడే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని టాక్ నడుస్తోంది. ఈ సినిమా షూటింగ్ లో కొన్ని అవాంతరాలు ఎదురయ్యాయని, కొన్ని సీన్స్ రీ షూట్ చేస్తున్నారని అక్టోబర్ 2లు షూటింగ్ ఫినిష్ అయ్యే అవకాశం లేదని టాక్. ఒకవేళ ఈ అక్టోబర్ లాంగ్ వీకెండ్ డేట్‌ను గనుక మేకర్స్ మిస్ చేసుకుంటే.. ఆ తర్వాత ఈ ఏడాదిలో సరైన విండో దొరకడం కష్టమేనని ఇండస్ట్రీ విశ్లేషకులు భావిస్తున్నారు.

Printed, Published and Owned by CB Mohan Rao, Printed at Spandana Printers, 2-165, Peruru, Tirupati, Andhra Pradesh, and Published from 20-3-122/C, Onti Maddimanu Street, Tirupati Andhra Pradesh, Editor, C.B. Mohan Rao, PRGI No. APTEL/25/A3753, Ph: 98660 71887 Email. andhramanam2025@gmail.com